# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 24-8-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 19 పేజీలు:6 వెల: రూ.1/-

## రైలు కింద భార్యను తోసేసి.. పిల్లలతో పరారైన తండ్రి..

న్యూఢిల్లీ, ఆగష్టు 23: రైల్వే స్టేషన్‌లో ఇద్దరు పిల్లల పక్కనే పడుకొని నిద్రపోతోందా తల్లి. తెల్లారుజామున 4 గంటలకు భర్త వచ్చి ఆమెను బలవంతంగా నిద్రలేపాడు. ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపే.. ఆమెను లాక్కొచ్చి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడేశాడు. ఆమె అక్కడికక్కడే మరణించింది. ఆ తర్వాత ఇద్దరు పిల్లలను తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడా వ్యక్తి. ఈ ఘటన మహారాష్ట్రలోని వసాయ్ రోడ్ రైల్వేస్టేషన్‌లో వెలుగు చూసింది.ఇదంతా అక్కడ ఉన్న సీసీ కెమెరాలో రికార్డయింది. ఇలా భార్యను చంపేసిన తర్వాత వేరే రైలు ఎక్కి పారిపోయిడా వ్యక్తి. రెండు రైళ్లు మారి థానే చేరుకున్నాడు. అక్కడి భివాండీ టౌన్‌లో ఉండగా నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి భార్య కొన్ని రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిందని, నిందితుడి స్నేహితుడితో వెళ్లి రెండ్రోజుల తర్వాత తిరిగొచ్చిందని, దీంతో ఆమె క్యారెక్టర్‌పై అనుమానంతోనే హత్య చేశాడని పోలీసులు తెలిపారు.

## బీజేపీ నేతలు కవిత ఇంటిపై దాడి చేయడం దారుణం : తలసాని



హైదరాబాద్, ఆగష్టు 23: నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటిపై బీజేపీ నేతలు దాడికి దిగడం దారుణమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్‌తో కలిసి మంత్రి మంగళవారం ఎంపీ కవితను పరామర్శించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. వజ్రోత్సవాల ముగింపు వేడుకలు జరుగుతున్న సమయంలో బీజేపీ నేతలు కవిత ఇంటిపై రావడం దుర్మార్గమని, హేయమైన చర్యని మండిపడ్డారు.

బీజేపీ నేతలు, జిల్లా పార్టీ అధ్యక్షుడు రావడం సిగ్గుచేటన్నారు. మా ఇంట్ల మీదికి రావాలంటే పెద్ద విషయం కాదని, మా టీఆర్ఎస్ సైన్యం ఎంతో తెలుసా? అన్న ఆయన.. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నిన్న ముట్టడికి కారణం ఏంటని..? ఆ అంశంపై మీకు అవగాహన ఉందా? అని ప్రశ్నించారు. ఒక ఎంపీ మాట్లాడిన మాటలను.. తప్పుడు ఆరోపణలను పట్టుకొని బాధ్యత గల వ్యక్తి ఇంటికి రావడం సమంజసం కాదన్నారు.

వేలాది సైన్యం తమకూ ఉందని, మీ ఇండ్ల మీద దాడులు, పార్టీ ఆఫీస్‌ల మీదకు వస్తే పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. సంఘీభావం చెప్పడానికి వచ్చిన మా కార్యకర్తలు.. బీజేపీ ఆఫీస్ ముట్టడికి వెళ్తామని అని ఉంటున్నారని, మాకు సంస్కారం ఉందని.. మా పార్టీ అధినేత అది మాకు నేర్పలేదన్నారు. బీజేపీ నేతలు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## 25న కాకతీయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం!

వరంగల్, ఆగష్టు 23: ఉత్తర తెలంగాణలో మొట్టమొదటి విశ్వవిద్యాలయమైన కాకతీయ యూనివర్సిటీ 22వ స్నాతకోత్సవం ఈ నెల 25వ తేదీన క్యాంపస్‌లోని ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం అవుతుందని యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేశ్ తెలిపారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అధ్యక్షత వహిస్తారని వీసీ పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు(ఎస్‌సీఆర్‌బీ) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీకి చెందిన ఆచార్య సందీప్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. 22వ స్నాతకోత్సవంలో 56 పీహెచ్‌డీ డిగ్రీలను అందజేయనున్నట్లు ప్రకటించారు.

బంగారు పతకాలు తీసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

## వచ్చే నెల మొదటివారంలో ఉచిత చేపపిల్లల పంపిణీ: మంత్రి తలసాని



హైదరాబాద్, ఆగష్టు 23: వచ్చే నెల మొదటి వారంలో ఉచిత చేప పిల్లలు, రొయ్య పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మాసాబ్ ట్యాంక్‌లోని మత్స్యశాఖ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన పశు సంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యాలతో కలిసి అన్ని జిల్లాల మత్స్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది 26,778 నీటి వనరుల్లో రూ. 88.53 కోట్ల వ్యయంతో 68 కోట్ల చేప పిల్లలు, 24.50 కోట్ల రూపాయల వ్యయంతో 275 నీటి వనరుల్లో 10 కోట్ల రొయ్య పిల్లలను విడుదల చేస్తామని చెప్పారు. సెప్టెంబర్ మొదటి వారం వరకు చేప, రొయ్య పిల్లల సరఫరాకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా ఉన్న చేప పిల్లలను మాత్రమే విడుదల చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తిరస్కరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. తిరస్కరించేందుకు గల కారణాలను కూడా కమిషనర్ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చేప పిల్లల విడుదల సమయంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, మత్స్య సహకార సొసైటీల సభ్యులను భాగస్వాములను చేయాలని సూచించారు. ఒకరోజు ముందే సంబంధిత సొసైటీ సభ్యులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం చేరవేయాలని ఆదేశించారు.

చేప పిల్లల విడుదల ప్రక్రియను తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఆదేశించారు. ఉదయం 9 గంటలలోపే చేప పిల్లల విడుదల ప్రక్రియను పూర్తి చేయాల న్నారు. విడుదల ప్రక్రియ పూర్తయిన వెంటనే సంబధిత మత్స్యకారుల కు విడుదల చేసిన చేప పిల్లల సంఖ్య, రకాలను వివరించాలని, ప్రత్యేక ధృవీకరణ పత్రంలో వివరాలను నమోదు చేసే లా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు కార్యాలయలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి, తగు ఆదేశాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ ఎన్ని చేప, రొయ్య పిల్లలను ఎన్ని నీటి వనరుల్లో విడుదల చేశారో ఆ వివరాలను టీ మత్స్య పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. చేప పిల్లల లెక్కింపులో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా, సమయం వృథా కాకుండా ఉండేందుకు అవసరమైన మేరకు మిషన్లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ లచ్చిరాం భూక్యాను మంత్రి ఆదేశించారు. ఏ చెరువులో ఎంత నీరుందో పర్యవేక్షించేందుకు ఇప్పటి వరకు 26 వేల నీటి వనరులను జియో ట్యాగింగ్ చేశామని తెలిపారు. దీనివల్ల 2016-17 నుంచి ప్రారంభించిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంతో రాష్ట్రంలో మత్స్య సంపద ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, మత్స్యకారుల ఉపాధి అవకాశాలు కూడా ఎంతో మెరుగయ్యాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు.

## వీఎల్ ఎస్ఆర్‌సామ్ క్షిపణి ప్రయోగం విజయవంతం



హైదరాబాద్, ఆగష్టు 23: ఎ౨-౼ాఖీ౦౦ఓ ၊ వీఎల్ ఎస్ఆర్‌సామ్ క్షిపణి ప్రయోగం విజయవంతం

ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించగలిగే వెర్టికల్ లాంచ్ షార్ట్ రేంజ్ క్షిపణి (వీఎల్?ఎస్ఆర్‌సామ్) పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని చాందీపూర్‌లోగల ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి భారత్ మంగళవారం ఈ క్షిపణిని పరీక్షించింది. నేవీ షిప్ నుంచి హై స్పీడ్ మావనరహిత విమానాన్ని ఈ క్షిపణి విజయవంతంగా ఛేదించింది.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో), ఇండియన్ నేవీ సంయుక్తంగా ఈ ప్రయోగాన్ని నిర్వహించాయి. వీఎల్ ఎస్ఆర్‌సామ్ క్షిపణిని డీఆర్డీవో స్వదేశీ టెక్నాలజీతో రూపొందించి, అభివృద్ధి చేసింది. క్షిపణి ప్రయోగ పరీక్ష విజయవంతం కావడంతో డీఆర్డీవో, భారత నౌకాదళం, అనుబంధ బృందాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు. ఇది భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.

## భార్య పుట్టింటికెళ్లిందని.. భర్త బలవన్మరణం

హైదరాబాద్, ఆగష్టు 23: భార్య పుట్టింటికి వెళ్లిందని తీవ్ర మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పీ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట పోచమ్మబస్తీకి చెందిన రావుల అంజయ్య కుమారుడు రావుల కృష్ణ(30)కు కొన్నేండ్ల క్రితం పావని అనే అమ్మాయితో వివాహమైంది. వీరికి కుమార్తె రుతికశ్రీ(4) ఉంది.

అయితే గత కొంతకాలం నుంచి భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఈ క్రమంలో ఓ రెండుసార్లు కృష్ణ ఆత్మహత్యాయత్నం చేశాడు.

అయితే గత నెల 26వ తేదీన పావని తన కూతుర్ని తీసుకొని పుట్టింటికి వెళ్లింది.

దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కృష్ణ మంగళవారం తెల్లవారుజామున తన ఇంటి రెండో అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్ర గాయాలపాలైన కృష్ణను ఉస్మానియా దవఖానాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కృష్ణ సోదరుడు ఆనంద్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి సబిత సమీక్ష



హైదరాబాద్, ఆగష్టు 23: రంగారెడ్డి జిల్లాలో సీఎం కేసీఆర్ ఈ నెల 25న పర్యటించనున్నారు. పర్యటనలో జిల్లా ఇంటిగ్రేటెడ్ కల్టెక్టరేట్ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం, ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, సీపీ మహేశ్ భగవత్ అధికారులతో సమీక్షించారు. సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్ల చేయాలని ఆదేశించారు. అనంతరం బహిరంగ సభ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వం ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగర కలాన్‌లో సకల సదుపాయాలతో రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను నిర్మించిన విషయం తెలిసిందే. 40 ఎకరాల స్థలంలో రూ.32 కోట్లు వ్యయంతో అద్భుతంగా నిర్మించింది. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు పూర్తవగా.. ప్రారంభానికి సిద్ధమైంది. ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ హాజరుకానుండడంతో కలెక్టర్ అమయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఎం కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం.. 15 ఎకరాల్లో 30వేల మందితో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొని, ప్రసంగించనున్నారు. కలెక్టరేట్ భవనానికి ఎదుట టీఎస్ఐఎస్‌కు చెందిన 30 ఎకరాల భూమి ఉండడంతో అందులోనే భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## హైకోర్టులో బీజేపీకి షాక్.. బండి యాత్రపై పిటిషన్ స్వీకరించని కోర్టు

హైదరాబాద్, ఆగష్టు 23: బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రపై అభ్యంతరం వ్యక్తం కావడంతో పోలీసులు అడ్డుకున్నారు. వరంగల్ పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు యాత్ర నిర్వహించకుండా బండి సంజయ్?ని కరీంనగర్ తరలించారు. కాగా, ప్రజా సంగ్రామ యాత్రకు సంబంధించి అత్యవసరంగా హౌజ్ మోషన్ పిటిసన్? దాఖలు చేసింది బీజేపీ. కాగా, దీనిపై హైకోర్టు ఈ పిటిషన్‌ని తిరస్కరించింది. లంచ్? మోషన్ పిటిషన్ దాఖలు చేయాలని వారికి సూచించినట్టు తెలుస్తోంది.

## రోజూ డేట్స్‌ను తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం సొంతం



న్యూఢిల్లీ, ఆగష్టు 23: : ప్రతిరోజూ రెండు, మూడు డేట్స్‌ను ఆహారంలో భాగంగా తీసుకుంటే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. సాయంత్రం స్నాక్స్ కింద డేట్స్‌ను తీసుకుని మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని సూచిస్తున్నారు. డేట్స్ రక్తనాళాల్లో పేరుకుపోయే వ్యర్థాలను తొలగిస్తాయి. ధమనులు మూసుకుపోయేలా పేరుకుపోయే లైమ్‌ను ఖర్జూర పండ్లు తొలగిస్తాయి.

దీంతో స్ట్రోక్‌లు, గుండె పోటు, ఇతర వ్యాధుల ముప్పు నుంచి డేట్స్ కాపాడతాయి. రోజుకు మూడు డేట్స్ తీసుకోవడం ద్వారా తీవ్ర అనారోగ్యాల బారిన పడే ముప్పు తగ్గుతుంది. ఇక కాలేయాన్ని కూడా ఖర్జూరాలు ఆరోగ్యంగా ఉంచుతాయని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. గుండెకు ఖర్జూరాలు ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే పొటాషియం కార్డియోవాస్క్యులర్ జబ్బులను నిరోధిస్తుంది.

ఇది శరీరంలో పేరుకుపోయే ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా స్ట్రోక్, గుండెపోటు ముప్పు నియంత్రిస్తుంది. డేట్స్‌లో ఉండే విటమిన్ ఏ కండ్ల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. హానికారక యూవీ రేస్‌తో పోరాడుతుంది. స్నాక్స్‌లా డేట్స్‌ను తీసుకుంటే తక్షణ శక్తి సమకూరుతుంది. డేట్స్‌లో ఉండే ఔషధ గుణాలు శరీరంలో టాక్సిన్స్‌ను బయటకు పంపడమే కాకుండా ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. అమినో ఆమ్లాలు జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తాయి. ఇక డేట్స్‌లో ఉండే మెగ్నీషియం శరీరంలో నొప్పిని, వాపు నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

### చరిత్రలో నేటినిజం



కం॥ "జ్యోతి జనులు కీర్తించెడి
సీతకు రూపము'గ నిలువ-శ్రీ రాముడు-వి
ఖ్యాతిని జోరుగ కురిసెను
జోడిగ చెలువొందు 'అంజలీదేవి' వయిన్!

(ఆగష్టు 24 నటి అంజలీదేవి జయంతి..)



-రాధశ్రీ

సెల్:9494481210

ఆహ్వానం

పీచర సునీతారావు మెమోరియల్ ట్రస్ట్
ఆధ్వర్యంలో
డా॥ కాంచనపల్లి గోవర్థన రాజు రచించిన
"తరాజు"
విమర్శనాగ్రంథావిష్కరణ




తేది : 28 ఆగష్టు 2022, సమయం : 10.30 ని॥లకు
స్థలం : రవీంద్రభారతి మినీహాల్, హైదరాబాద్.

అధ్యక్షులు :
శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్, ప్రముఖ విమర్శకులు

ముఖ్య అతిథి :
శ్రీ అల్లం నారాయణ, ప్రెస్ అకాడెమీ చైర్మన్ మరియు ప్రముఖ కవి

ఆవిష్కకర్త :
శ్రీ జూలూరి గౌరీశంకర్, సాహిత్య అకాడెమి చైర్మన్ మరియు ప్రముఖ కవి

విశిష్ట అతిథులు :
శ్రీ మామిడి హరికృష్ణ, కల్చరల్ డైరెక్టర్
శ్రీమతి దేవకీ దేవి, ప్రముఖ సాహితీవేత్త

ప్రత్యేక అతిథులు :
డా॥ ఎస్. రఘు, ప్రముఖ సాహితీ వేత్త మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్
డా॥ బాణాల శ్రీనివాస్ రావు, ప్రముఖ కవి, అసోసియేట్ ప్రొఫెసర్

ఆహ్వానించువారు :
పి. విజయేందర్ రావు, కన్వీనర్
పీచర సునీతారావ్
మెమోరియల్ ట్రస్టు, హైదరాబాద్

అనంతరం భోజనం

# 68 - ఏండ్లుగా కళా, సాహిత్య పోషణలో జాతీయ అకాడమీలు

## (ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా సవాళ్లను దాటుతూ సాఫల్యత వైపు పయనం)

భారతీయ సంస్కృతి వారసత్వాల నిధిని కాపాడుకుంటూ, ప్రోత్సహిస్తూ కొనసాగాలనే స్వతంత్ర భారత ఆలోచనలకు అనుగుణంగా స్వాతంత్ర్యం పొందిన తొలి నాళ్లలో నేషనల్ కల్చరల్ ట్రస్ట్ ఏర్పాటు కావాలనే అభిప్రాయాలను రాయల్ ఏసియటిక్ సొసైటీ వ్యక్తం చేసింది. స్వేచ్ఛ వాయువులు పీల్చిన భారతంలో కేంద్ర ప్రభుత్వం అక్షర, దృశ్య, నాట్య విభాగాలకు వేరు వేరుగా మూడు అకాడమీలు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. జాతీయ స్థాయిలో భారతీయ కళ్ల పోషణకు ప్రత్యేక సంస్థలు కావాలని నాటి సాంప్రదాయ, ఆధునిక పేయింటర్స్, డ్యాన్సర్స్, సింగర్స్, ఆక్టర్స్ కలిసి నాటి ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. 1953 తరువాత జాతీయ స్థాయిలో సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, సాహిత్య అకాడమీలను తీసుకురావడం శుభపరిణామంగా భావించాలి. సంస్కృతికి పునరుజ్జీవనంలో భాగంగా స్వతంత్ర భారతంలో దేశ కళా సంపదలను పరిరక్షించుకోవడం, ప్రోత్సహిస్తూ కళలను పోషించడం, ప్రతిభ కనబర్చిన కళాకారులు, సాహితీవేత్తలకు పురస్కారాలు అందించడం ప్రతి ఏట నిర్వహించాలని ఈ అకాడమీలకు బాధ్యతలు ఇవ్వడం జరిగింది.

### జాతీయ సంగీత, నాటక, నాట్య అకాడమీ:

సంగీత, నాట్య, నాటక రంగాల్లో నిష్ణాతులను ప్రోత్సహించడం, రాబోయే తరాలకు కళలను వాలసత్వ సంపదగా అందించడం నిత్యం జరగాలనే సదుద్దేశంతో 31 మే 1952న డా: పి వి రాజమన్నార్ అధ్యక్షుడిగా 'జాతీయ సంగీత నాటక అకాడమీ' ఏర్పడి, 28 జనవరి 1953న నాటి రాష్ట్రపతి డా: రాజేంద్రా ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ అకాడమీ ద్వారా పలు రాష్ట్రాల్లో శాఖలు (మణిపూర్ డ్యాన్స్ అకాడమీ, సత్రియ అకాడమీ, కథక్ కేంద్ర, రవీంద్ర రంగశాల, కుటియట్టం సెంటర్, చావ్ సెంటర్, నార్త్ఈస్ట్ సెంటర్ లాంటివి) ప్రారంభించి అరుదైన సంగీత, ఫిలిమ్, సాంప్రదాయ వేషధారణలను సేకరించి ప్రత్యేకంగా భద్రపరచడం జరుగుతున్నది. సంగీత, నాటక, నాట్య అకాడమీల ద్వారా పాఠశాలల స్థాపన, పరిశోధనలకు నిధుల మంజూరు, భద్రపరచడం, వార్షిక జాతీయ అంతర్జాతీయ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, దృశ్య శ్రవణ ఆర్కీవ్స్, లైబ్రరీ, సంగీత ఉపకరణాల ప్రదర్శనశాలల నిర్వహణ, అవార్డుల (ఉస్థాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం, టాగూర్ రత్న, టాగూర్ పురస్కారాలు లాంటివి) ప్రధానం లాంటి పలు బాధ్యతలను అకాడమీ చూసుకొంటుంది.

### జాతీయ లలిత కళా అకాడమీ:

లలిత కళా అకాడమీ లేదా నేషనల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్సను 05 ఆగష్టు 1954న స్థాపించి కాలానుగుణంగా ప్రదర్శనలు, ఫెల్లోషిప్‌లు, అవార్డులు, విదేశీ ప్రదర్శనలు, జాతీయ కళా ప్రదర్శనలు, రాష్ట్రీయ కళా మేలాల నిర్వహణలు, గర్హీ స్టూడియో స్థాపన లాంటివి నిర్వహిస్తారు. లలిత కళా అకాడమీ శాఖలు భువనేశ్వర్, చెన్నై, బెంగుళూరు, ఢిల్లీ, కొల్‌కతా, లక్నో, సిమ్లా నగరాల్లో సేవలు అందిస్తున్నాయి.

### కేంద్ర సాహిత్య అకాడమీ:

15 డిసెంబర్ 1952న తీసుకున్న నిర్ణయం ప్రకారం నేషనల్ అకాడమీ ఆఫ్ లెటర్స్ లేదా సాహిత్య అకాడమీని అధికారికంగా 12 మార్చి 1954న స్థాపించడం జరిగింది. 07 జనవరి 1956న సొసైటీగా రిజిస్టర్ చేయబడిన కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా దేశంలోని 24 ప్రముఖ భాషల్లోని సాహిత్యాలను ప్రోత్సహించడం, సాహిత్యాన్ని ముద్రించడం, సెమినార్ల నిర్వహణ, పరిశోధనలకు నిధుల కల్పన, ఇతర భాషల్లోకి తర్జుమా చేయడం, లైబ్రరీల్లో భద్రపరచడం, సాహిత్య అకాడమీ అవార్డుల ప్రదానం, ఫెల్లోషిప్‌ల మంజూరు లాంటి కార్యాలను నిర్వహిస్తారు. ఇప్పటి వరకు దాదాపు 6,000లకు పైగా పుస్తకాలను సాహిత్య అకాడమీ ముద్రించి మనకు అందుబాటులో ఉంచింది.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## పంచాయతీ కేంద్రంగా మున్సిపాలిటీ నిబంధనలు గాలికేనా..!

వరంగల్, ఆగష్టు 23: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ కేంద్రంలోని పురపాలక సంఘ కార్యాలయ స్థలం పంచాయతీలకు కేంద్రంగా తయారైంది. వద్దని చెప్పాల్సిన పాలక వర్గామే కుర్చీలు వేసుకుని మరీ పంచాయతీలు చేస్తోందంటే మున్సిపాలిటీ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ సమయంలో కమిషనర్, చైర్మన్ సైతం కార్యాలయంలో ఉండటం గమనార్హం. మున్సిపాలిటీలో పంచాయతీలు చేయటం చట్ట రీత్యా నిషిద్ధం అని నోటీస్ బోర్డులు కమిషనర్ పేరిట ఏర్పాటు చేశారు. అయితే ఆ నిబంధనలకు పాలక వర్గ సభ్యులే తూట్లు పొడుస్తున్నారు. ఈ ఘటన పై కమిషనర్ ఏమైనా చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

## టంగుటూరి ప్రకాశం పంతులుకు సీఎం జగన్ ఘన నివాళి



అమరావతి, ఆగష్టు 23: స్వాతంత్ర సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర సంగ్రామపథంలో తెలుగువారి కీర్తి పతాక ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులని అని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడ్డ ఆంధ్రరాష్ట్రానికి తొలిముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి పునాదులు వేశారని కొనియాడారు.

## గన్నవరంలో రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి

అమరావతి, ఆగష్టు 23: గన్నవరం ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజమండ్రిలో శుభకార్యానికి వెళ్లి తిరిగి విజయవాడ వస్తుండగా గన్నవరం ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద లారీని కారును వెనక నుండి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏపీ జెన్ కో ఉద్యోగి వరప్రసాద్ భార్య ఘటనా స్థలంలోనే మృతి చెందింది. కారులో ముగ్గురు ప్రయాణిస్తుండగా వర ప్రసాద్ కు స్వల్ప గాయాలు కాగా ఒక మహిళ మృతి, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన మహిళలను 108 వాహనంలో కామినేని హాస్పిటల్ కి తరలించారు.




# కేసుల నుంచి బయటపడేందుకు వచ్చారా?..

## –సీఎం జగన్ ఢిల్లీ టూర్‌పై టీడీపీ నేతల ప్రశ్నలు

న్యూఢిల్లీ, ఆగష్టు 22: కేసుల నుంచి బయటడేందుకు వచ్చారా? లేక కేంద్ర ప్రభుత్వం వద్ద తల వంచేందుకు ఢిల్లీ వచ్చారా అనేది ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ఉందని తెలుగుదేశం పార్టీ నేతలు అన్నారు. టీడీపీ రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్, తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత సోమవారం న్యూఢిల్లీలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు జగన్ ఢిల్లీ టూర్‌పై విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి హుటాహుటిన ఢిల్లీకి వస్తే రాష్ట్రానికి నిధులు రాబడుతున్నారనుకున్నాం, ప్రాజెక్టుల ఒప్పందానికి సంతకాలు పెడుతున్నారనుకున్నామని రవీంద్ర కుమార్ చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రిని, విద్యుత్ శాఖ మంత్రిని కలిశాక ఏం మాట్లాడారో మాత్రం చెప్పడం లేదన్నారు.

ప్రధానిని అనేకసార్లు కలిసిన జగన్ ఒకటే నివేదిక, ఒకే అంశాలు తప్ప మరేమీ ఉండట్లేదని విమర్శించారు. ఇన్ని విజ్ఞప్తులకు కనీసం ఫైల్ నెంబర్లైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు వెనకబడానికి కారణం వైసీపీయేనని కనకమేడల ఆరోపించారు. జగన్‌ది రివర్స్ గవర్నమెంట్, డిస్ట్రక్షన్ ఆక్టివిటీ అని ఆయన దుయ్యబట్టారు. జలశక్తి శాఖ మంత్రి పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమంటున్నారని వెల్లడించారు. రాష్టానికి ఆర్థిక నిధులు లేక, ప్రణాళిక లేక, ప్రాజెక్ట్ కోఆర్డినేషన్ లేక ఆలస్యమవుతోందని స్వయానా కేంద్రమంత్రే పార్లమెంట్‌లో చెప్పారని ఆయన గుర్తు చేశారు.

గతంలో ప్రధాని కార్యాలయంలో ఇచ్చిన వినతి పత్రాలేంటి? వాటి వివరాలు, ప్రస్తుతం వాటి పరిస్థితి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును జగన్ చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

స్కాములు, కేసుల నుంచి బయట పడేయమని అడగడానికి వచ్చారా అని ప్రశ్నించిన ఎంపీ, ప్రజలకు చెప్పవలసిన అంశాలపై గోపత్య ఎందుకని నిలదీశారు. విద్యుత్ కొనుగోలు ఆపేస్తామని కేంద్రమంత్రి చెప్పారని కనకమేడల తెలిపారు.

### ఏపీలో మహిళలకు రక్షణ లేదు : అనిత

ప్రధానితో కలిసి మాట్లాడిన విషయాలు చెప్పలేని స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారని అనిత ఎద్దేవా చేశారు. వైఎస్సార్సీపీ ఎంపీలు అసభ్య పనులు చేస్తుంటే వారిని కాపాడటానికి జగన్ ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని ఆమె విమర్శించారు. ఏపీలో లిక్కర్ మాఫియా పాలన సాగుతోందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ అంటే సమాధానం చెప్పలేని స్థితిలో వైఎస్సార్సీపీ నేతలున్నారని ఆమె అన్నారు. డ్రగ్స్ సహా దేశంలో ఎలాంటి చెడ్డ పనులు జరిగినా ఆంధ్రప్రదేశ్ పేరు చర్చకు రావడానికి వైసీపీ నేతలే కారణమని ఆరోపించారు. జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేదని అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌కు గోరంట్ల మాధవ్‌ను రక్షించుకోవాలన్న తపనలో కనీసం 10 శాతం కూడా మహిళల రక్షణపై ఉంటే బాగుండేదని ఆమె అభిప్రాయపడ్డారు

# విభజన హామీలు అమలు చేయండి.. పోలవరం పూర్తి చేయండి: ఢిల్లీలో సీఎం జగన్

న్యూఢిల్లీ, ఆగష్టు 22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు రాబట్టడం, విభజన హామీల అమలు అంశాల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దూకుడు పెంచారు. ఆదివారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న ఆయన, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ తో రాష్ట్రానికి సంబంధించిన అంశాలను చర్చించి, రాష్ట్రపతికి శుభాకాంక్షలు తెలిపి 24 గంటలు తిరిగేసరికి విజయవాడ తిరిగి వెళ్లిపోయారు. విభజన తర్వాత పలు సవాళ్లను ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సహాయ సహకారాలు అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ&ఢప్తి చేశారు. వైఎస్సార్సీపీ పార్లమెంటరీ నేతలు విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డితో కలిసి సీఎం జగన్ సోమవారం ఉదయం ముందుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ఆయన నివాసంలో కలిశారు. వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహూకరించారు.

ప్రధానితో భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది. పోలవరం, రీసోర్స్ గ్యాప్ కింద నిధులు, జాతీయ ఆహార భద్రతాచట్టం కింద అర్హుల ఎంపికలో హేతుబద్ధత, విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా తదితర అంశాలపై పీఎంకు వినతిపత్రం అందించి వాటిపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సత్వరమే పూర్తిచేయడానికి తగిన సహాయ సహకారాలు అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం తాము ఖర్చు పెట్టిన రూ. 2900 కోట్ల రూపాయలను తిరిగివ్వాలని జగన్ కోరారు. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపాలని, టెక్నికల్ అడ్వైజర్ కమిటీ నిర్ధారించిన ప్రాజెక్టు వ్యయం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాజెక్టు నిర్మాణంలో కాంపొనెంట్ వైజ్‌గా రిఎంబర్స్ విధానానికి స్వస్తి చెప్పాలని, దీనివల్ల పనుల్లో విపరీత జాప్యం ఏర్పడుతోందని ఆయన ప్రధానమంత్రి వివరించారు. అన్ని జాతీయ ప్రాజెక్టుల్లో వ్యవహరించినట్టుగానే మొత్తం ప్రాజెక్టు వ్యయాన్నే పరిగణనలోకి తీసుకుని ఆమేరకు తాము చేస్తున్న పనులకు వెంటనే రిఎంబర్స్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులకు 15 రోజుల్లోగా చెల్లింపులు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డీబీటీ పద్ధతి ద్వారా భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల కింద నిర్వాసితులకు పరిహారాన్ని అందించాలని ఆయన కోరారు. ప్రాజెక్టు నిర్మాణ పనులను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడానికి వీలుగా అడహక్‌గా రూ.10వేల కోట్లు ఇవ్వాలని ప్రధానమంత్రికి వినతి చేశారు.

రీసోర్స్‌గ్యాప్ కింద రాష్ట్రానికి రావాల్సిన రూ. 32,625.25 కోట్లు మంజూరు?చేయాలని జగన్మోహన్ రెడ్డి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. 2014?15 కాలానికి సంబంధించిన బిల్లుల రూపంలో, 10వ వేతన సంఘం బకాయిల రూపంలో, పెన్షన్లు తదితర రూపంలో రాష్ట్రానికి రావాల్సిన ఈనిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ ఆహార భద్రతా చట్టంకింద అర్హుల ఎంపికలో హేతుబద్ధీకరణ లేకపోవడంవల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఇదివరకే ఈ అంశాన్ని దృష్టికి తీసుకొచ్చానంటూ ఆయన ప్రధానికి వివరించారు. రాష్ట్రంలో 2.68 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ అందుతోందని సీఎం నరేంద్రమోదీకి వివరించారు.

వీరిలో 61శాతం మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు కాగా, 41 శాతం మంది పట్టణ ప్రాంతాలకు చెందినవారు ఉన్నారని చెప్పుకొచ్చారు. చట్టం నిర్దేశించిన ప్రకారమే గ్రామీణ ప్రాంతాల్లో 75 శాతం మందికి, అర్బన్ ప్రాంతంలో 50శాతం మందికి పీడీఎస్ కింద ప్రయోజనాలు అందాల్సింది ఉందని ఆయన తెలిపారు. ఏపీతో పోల్చుకుంటే ఆర్థికంగా మెరుగైన స్థాయిలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్‌రాష్ట్రాల్లో రాష్ట్రంకంటే కనీసంగా 10శాతం మంది లబ్ధిదారులు అధికంగా ఉన్నారని ప్రధానికి చెప్పారు. దీనివల్ల అర్హులైన వారికి రాష్ట్రంలో ఇది వర్తించట్లేదని, కేంద్రం ఇస్తున్నదానికంటే అదనంగా దాదాపు 56 లక్షలమందికి పీడీఎస్‌ను రాష్ట్రమే వర్తింపజేస్తోందని ఆయన వెల్లడించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్ర భారంగా మారిందని, ఇప్పటికే దీనిపై నీతిఆయోగ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమై తదుపరి కీలక నిర్ణయం తీసుకుని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తున్న కేటాయింపులను పరిశీలించాలంటూ ప్రధానమంత్రికి జగన్ గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద కేంద్రం ఇస్తున్న దానికంటే, కేంద్రం కవర్ చేయని, అదనంగా 56 లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం వర్తింపు చేసిందని, దీనివల్ల సుమారు రూ.5,527.63 కోట్ల రూపాయలు అదనపు భారాన్ని రాష్ట్రం యోయాల్సి వచ్చిందని ఆయన వాపోయారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కొనసాగిస్తున్నందున ఈ భారం మరింతగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. జాతీయ ఆహార భద్రతా చట్టం లబ్ధిదారుల గుర్తింపు విషయాన్ని వెంటనే పునఃపరిశీలన చేయాలని కోరారు. నెలవారీగా రాష్ట్రానికి కేటాయిస్తున్న బియ్యం కోటాలో 3 లక్షల టన్నులు వినియోగం కాకుండా ఉంటున్నాయని, ఇందులో కేవలం 77వేల టన్నులు కేటాయిస్తే సరిపోతుందని, కేంద్రంపై కూడా ఎలాంటి అదనపు భారం ఉండదని ప్రధానమంత్రికి చెప్పుకొచ్చారు.

విభజనలో హేతుబద్ధత లేకపోవడం వల్ల ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని వాపోయారు. పార్లమెంటుసాక్షిగా ఇచ్చిన హామీలు చేయాలని స్పష్టం చేశారు. ప్రత్యేక తరగతి హోదా సహా హామీలను అమలు చేయలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక రంగాభివృద్ధి, ఉద్యోగాల కల్పన, కేంద్రంనుంచి గ్రాంట్లు, పన్ను రాయితీలు తదితర ప్రయోజనాలు ప్రత్యేకతరగతి హోదా ద్వారా వస్తాయని, తద్వారా రాష్ట్రంపై భారం తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు కేవలం 11 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయని, కొత్తగామూడు కాలేజీలకు అనుమతి ఇచ్చారని, వాటి పనులు కూడా జరుగుతున్నాయని సీఎం వివరించారు.

ఇంకా 12 కాలేజీలకు అనుమతులు రావాల్సి ఉందని, వాటిని మంజూరు చేయాలని కోరారు. కడపలో ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్‌కోసం ఏపీఎండీసీకి ఇనుప గనులు కేటాయించాలని ప్రధానిని అడిగారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు గనుల కేటాయింపు చాలా కీలకమని, స్థిరంగా ఖనిజం రవాణా అన్నది ప్రాజెక్టు ఏర్పాటులో అత్యంత కీలక అంశమని చర్చించారు. ఏపీఎండీసీకి బీచ్‌శాండ్ మినరల్ ఏరియాలను కేటాయించాలను జగన్మోహన్ రెడ్డి కోరారు. 14 ఏరియాల కేటాయింపు అంశం ఇంకా పెండింగులో ఉందన్న ఆయన, ఈ రంగంలో దాదాపు రూ.20వేల కోట్ల పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉందని అన్నారు.

### సమస్యలను పరిష్కరిస్తాం : విద్యుత్ మంత్రి

అనంతరం ముఖ్యమంత్రి కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్‌ను కలిశారు. అరగంటసేపు విద్యుత్ అంశాలపై చర్చించారు. తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన బకాయిల అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ నుంచి రావలసిన రూ.6,756 కోట్ల బకాయిల సమస్య ఎనిమిదేళ్లుగా అపరిష్కృతంగానే ఉందని చెప్పారు. ఈ డబ్బు ఇప్పిస్తే పూర్తిగా కష్టాల్లో ఉన్న రాష్ట్ర విద్యుత్ కంపెనీలు ఒడ్డున పడతాయని, ఉత్పత్తిదారులకు బకాయిలు చెల్లించడానికి మార్గం సుగమమం అవుతుందని స్పష్టం చేశారు. సీఎంతో సమావేశం అనంతరం కేంద్ర మంత్రి ఆర్కేసింగ్ మీడియాతో మాట్లాడుతూ? విద్యుత్ రంగానికి సంబంధించిన సమస్యలను చర్చించామన్నారు.

తెలంగాణ పెద్దఎత్తున ఏపీకి బకాయిలు చెల్లించాల్సి ఉందని అన్నారు. తెలంగాణ నుంచి రావలసిన ఆరువేల కోట్ల రూపాయల బకాయిలపై చర్చించామని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ విషయం సొలిసిటర్ జనరల్ వద్ద ఉందని, త్వరలోనే దీనిపై తాము ఒక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇస్తున్నామన్నారు. చట్టం ప్రకారం ప్రాథమికంగా ఎవరు బకాయిలు చెల్లించాలనే దానిని పరిష్కారం చేస్తామని కేంద్రమంత్రి భరోసా ఇచ్చారు. పవర్ ఎక్స్ఛేంజీలలో కొనుగోళ్ల బకాయిలపై సమాచారంలో పొరపాట్లు లేవని ఆయన స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించని డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు 75 రోజుల్లోగా చెల్లించాలని చెప్పారు. బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని కోల్పోతారని మంత్రి ఆర్కే సింగ్ అన్నారు.

### రాష్ట్రపతికి అభినందనలు

రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ద్రౌపది ముర్మును జగన్మోహన్ రెడ్డి ఆమె నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని కానుకగా అందజేశారు. ఢిల్లీ పర్యటన పూర్తి చేసుకున్న జగన్మోహన్ రెడ్డి సాయంత్రం తిరిగి విజయవాడ వెళ్లిపోయారు.

## ఉన్నత స్థాయికి చేరాలంటే నిర్దిష్ట లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి: టీటీడీ ఈఓ ధర్మారెడ్డి




తిరుపతి, ఆగష్టు 23: ఉన్నత స్థానాలకు చేరేందుకు విద్యార్థి దశలోనే నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, చక్కటి ప్రణాళికతో లక్ష్యాలను సాధించుకోవాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి సూచించారు. లక్ష్యాలను అనుగుణంగా కష్టించడం ద్వారా మంచి ఫలితాన్ని అందుకోవచ్చున్నారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు.


విద్యార్థులు లక్ష్యాన్ని నిరంతరం గుర్తు పెట్టుకోవాలని, జీవితంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా నిరాశ చెందకూడదని ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. అకుంఠిత దీక్ష, శ్రమతో ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కోవచ్చున్నారు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన..' అనే పద్యాన్ని విద్యార్థులకు విడమర్చి చెప్పారు. ఉదాహరణగా ఏకలవ్యుడి కథను వినిపించారు. అలాగే, భగవద్గీతలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాలను ఉదహరించారు. మంచిస్థాయికి ఎదిగేందుకు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. భగవంతుడి కన్నా ముందు మన తల్లిదండ్రులను గుర్తుంచుకోవాలని, మన భవిష్యత్‌కు మార్గనిర్దేశనం చేసేది తల్లిదండ్రులు, గురువులు మాత్రమే అనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు.

అనంతరం కళాశాలలోని వివిధ పరిశోధనశాలల్ని ఈఓ ధర్మారెడ్డి పరిశీలించారు. కళాశాల వెనుక భాగంలో ఉన్న వ్యర్థాలను తొలగించి పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కళాశాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, తగినంతమంది సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని జేఈఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేఈఓ శ్రీమతి సదా భార్గవి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారి గోవిందరాజన్, అదనపు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సునీల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బహిరంగ సభాస్థలి మార్పు.. సఖి సెంటర్ సమీపంలో సభ



కరీంనగర్ , ఆగష్టు 23: తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హాజరయ్యే బహిరంగ సభాస్థలి మార్పు చేశారు. ఈరోజు జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ, దాసరి మనోహర్ రెడ్డితో పాటు పలు శాఖల అధికారులు సఖి సెంటర్ సమీపంలో గల స్థలంలో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ముందుగా అనుకున్న విధంగా మంథని ఫ్లైఓవర్ కింద గల స్థలంలో నీరు నిల్వ ఉండడంతో బహిరంగ సభా స్థలాన్ని మార్చాలని నిర్ణయించిన అధికారులు సఖి సెంటర్ సమీపంలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించి సభకు అనువుగా ఉంటుందని నిర్ణయించారు. దీంతో సభ కోసం ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాస్తు సలహాదారు సుద్దాల తేజ, చీఫ్ ఇంజనీర్ గణపతి రెడ్డి, డీసీపీ రూపేష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, దీపక్, చీఫ్ ఇంజనీర్ ఏసీపీలు సారంగపాణి, మోహన్, సిఐలు ప్రదీప్ కుమార్, అనిల్ కుమార్ లతోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల



ఖమ్మం, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి): అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఈరోజు ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో పర్యటించిన మంత్రి ఈశ్వర్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి ముందుకు సాగుతున్నారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులతోపాటు ప్రజా సమస్యల పరిష్కారం, మౌళిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తూ నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతూ అభివృద్ధి పనులను విజయవంతం చేయాలన్నారు.

అలాగే మల్లాపూర్ గ్రామంలో పర్యటించిన మంత్రి రైతు శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా మహిళలు శిక్షణతో మెళకువలు నేర్చుకొని స్వయం ఉపాధి రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. కాగా, కొత్తూరు గ్రామంలో బోయపల్లి నుంచి నిమ్మపల్లి మధ్య రోడ్డు నిర్మాణం, కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే కటికెనపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన బోనగిరి నారాయణ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు ముత్యాల బలరాంరెడ్డి, నోముల వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, తెరాస మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసినా పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య



మహబూబాబాద్, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 6 గురు లబ్ధిదారులకు 268500=00 రూపాయల చెక్కులను తెరాస మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు అయిలయ్య చేతుల మీదుగా అందించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజలు కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్న వారికీ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వైద్య ఖర్చులు ఇప్పిస్తున్న ఘనత మంత్రి గారికే దక్కుతుందని తెలిపారు. × పోచంపల్లి గ్రామానికి చెందిన

1.ఐ.సోమల్లు కు 40000=00
2.చిర్ర అనూష కు 20000=00
3.సుదగాని శ్రీకాంత్ కు 22500=00

పోచారం గ్రామానికి చెందిన మద్దెల హరీష్ కు 26000=00,
చిన్నవంగర గ్రామానికి చెందిన పాకనాటి లక్ష్మి కీ 60000=00,
×వడ్డేకొత్తపల్లి× గ్రామానికి చెందిన లింగమ్మ కు 100000=00 అఓఖీఈ చెక్కులను పంపిణి చేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు బానోత్ వెంకన్న, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, మాజీ ఎఫ్ఎసిఎస్ వైస్ చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్,నాయకులు సుదగాని మనోహర్,మండల పార్టీ అధికార ప్రతినిధి బానోత్ సోమన్న, నాయకులు సలీదండి సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు కొండపల్లి విజయపాల్ రెడ్డి,రాసాల వెంకన్న, కుకట్ల వీరన్న, బోనగిరి లింగమూర్తి, భూక్యా దాస్రు,రైతు కోఆర్డినేటర్లు పాకనాటి ఉపేందర్ రెడ్డి,మల్లికార్జున చారి,మాజీ జెడ్పీటీసీ జలగం వెంకటయ్య,నాయకులు నునవత్ బాలు,సోషల్ మీడియా కోఆర్డినేటర్ మైలపాక అనిల్, తెరాస నాయకులు నక్క భవాని కుమార్, మైలపాక యాకయ్య,చిర్ర ఐలమల్లు తదితరులు పాల్గొన్నారు.




సాహిత్య రంజని
సంగారెడ్డి
నిర్వహణలో
ప్రముఖ సాహితీవేత్త, అభినవ దాశరథి
దోరవేటి రచించిన
పయనమెచటికోయి...!?
(సామాజిక నవల)
ఆవిష్కరణ సభ

ఆహ్వానము

తేదీ : 28.8.2022
ఉ. 10 గం.కు
వేదిక : జిల్లా పరిషత్ హాల్ సంగారెడ్డి

సభాధ్యక్షులు
శ్రీ పల్లె పెంటా రెడ్డి గారు
సాహిత్య రంజని అధ్యక్షులు
ముఖ్యఅతిథి, ఆవిష్కర్త
డా. నందిని సిధారెడ్డి గారు
తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు
గౌరవ అతిథి
Ch. ఎల్లయ్య గారు
సీఈఓ, జిల్లా పరిషత్, సంగారెడ్డి
ఆత్మీయ అతిథి
డా. సురభి శంకర శర్మ గారు
ప్రముఖ కవి, అష్టావధాని
పుస్తక పరిచయం
డా. మహ్మద్ షరీఫ్ గారు
ప్రముఖ కవి
* కవి సమ్మేళనం కలదు
* కలిసి భోజనం చేద్దాం

అందరూ ఆహ్వానితులే

- ఆకుల బాబూరావు
సాహిత్య రంజని ప్రధాన కార్యదర్శి




# అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నవభారత నిర్మాణానికి ముందడుగు వేయాలి

## – కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్యరాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఆగష్టు 22: భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ఓ ప్రత్యేకమైన అధ్యాయమని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భారతీయ సంపదను దోచుకునేందుకు వచ్చిన బ్రిటిషర్లకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నవభారత నిర్మాణానికి మనమంతా పునరంకితం కావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

రంప ఉద్యమం శతజయంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు నడయాడిన చింతపల్లి ప్రాంతంలో క్షత్రియ సేవా సమితి (ఆంధ్రప్రదేశ్ ఔ తెలంగాణ) ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి కేంద్ర మంత్రులు శ్రీ జి. కిషన్ రెడ్డి, శ్రీ అర్జున్ ముండా విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని కేంద్ర మంత్రులు ఆవిష్కరించారు. అనంతరం, అల్లూరి అతని అనుచరులు మొట్టమొదటగా దాడిచేసిన చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని, అల్లూరి ప్రధాన అనుచరుడైన స్వాతంత్ర్య సమరయోధుడు గంటం దొరకు సంబంధించిన 11 కుటుంబాలకు పక్కా ఇళ్ల పట్టాలను అందజేశారు. మన్యం వీరుడి శౌర్యగాథలను ప్రస్తావిస్తూ డాక్టర్ కర్నం సత్యనారాయణ రాసిన పుస్తకాన్ని కేంద్ర మంత్రులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు మన్యం ప్రాంతానికో, ఉత్తరాంధ్ర ప్రాంతానికో చెందిన నాయకుడు మాత్రమే కాదని, యావద్భారతానికి ఆయన స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. మన్యం వీరుడి 125వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని భీమవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొని 'తెలుగు జాతి యుగ పురుషుడు అల్లూరి సీతారామరాజు' అని కొనియాడిన విషయాన్ని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి గుర్తుచేశారు. పంద్రాగస్టునాడు ఎర్రకోట ప్రసంగంలోనూ అల్లూరి పరాక్రమం గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా మొగల్లులోని ధ్యానమందిరం, చింతపల్లి పీఎస్ సహా అల్లూరి చరిత్రకు సంబంధించిన అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. మన్యం ప్రజలను వేధించడం ఆపకపోతే చింతపల్లి పోలీస్ స్టేషన్ పై దాడి చేస్తామని హెచ్చరించి మరీ దాడికి పాల్పడిన ధీరత్వం అల్లూరి, వారి అనుచరులదని ఆయన అన్నారు.

అల్లూరి శౌర్య పరాక్రమాల గురించి భారతీయులందరికీ తెలిసేలా హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ సహా దేశంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేకమైన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

కేంద్ర గిరిజన శాఖ మంత్రి శ్రీ అర్జున్ ముండా మాట్లాడుతూ.. గిరిజనులు ఎక్కడున్నా తమ ప్రాంతాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కు తగ్గరని అటువంటి వీరుల వంశం నుంచి వచ్చిన అల్లూరి సీతారామరాజు బ్రిటిషర్లను దేశం నుంచి తరిమేసేందుకు విప్లవ మార్గంలో ప్రజల్లో చైతన్యం రగిలించారన్నారు. ఆదివాసీల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని ఆయన అన్నారు. చింతపల్లి ప్రాంతాన్ని మోడల్ విలేజ్ గా అభివృద్ధి చేసి స్థానిక యువత ఉపాధికల్పనకు చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులతోపాటు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పీడిక రాజన్నదొర, అరుకు ఎంపీ (లోక్ సభ) శ్రీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే శ్రీ కె.భాగ్యలక్ష్మి, అరుకు ఎమ్మెల్యే శ్రీ చిట్టి ఫాల్గుణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రతి పల్లె అభివృద్ధిలో ఆదర్శం కావాలి- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



కామారెడ్డి, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి): ప్రతి పల్లె అభివృద్ధిలో ఆదర్శం కావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చెప్పారు. మంగళవారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంతో పాటు రామేశ్వర్ పల్లి గ్రామంలో 87 లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు.. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ఇటీవల ప్రతి గ్రామ పంచాయతీకి పదిలక్షల రూపాయలు సీఎం కేసీఆర్ కేటాయించారని గుర్తు చేశారు. 75 సంవత్సరాలలో జరగని అభివృద్ధి పనులు కేవలం ఎనిమిది సంవత్సరాలలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందని తెలిపారు.

రామేశ్వర్ పల్లి రాజకీయాలకు పుట్టినిల్లుగా మారిందని..అంతేకాకుండా గ్రామాభివృద్ధిలో ఐక్యతకు మారుపేరుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న పేదలను గుర్తించి అర్హులైన వారికి కొత్తగా 10 లక్షల పింఛన్లు మంజూరు చేశామన్నారు. దేశంలో ఎక్కడ జరగని అభివృద్ధి పనులు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నాయని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ ..ఎంపీపీ గాల్ రెడ్డి ..జడ్పీటీసీ పద్మ నాగభూషణం గౌడ్ ..మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్.. రామేశ్వర్ పల్లి గ్రామ సర్పంచ్ పోతిరెడ్డి.. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్సారెడ్డి ..మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు హనుమంత రెడ్డి సొసైటీ అధ్యక్షులు భూమి రెడ్డి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్సారెడ్డి మండల తెరాస అధ్యక్షులు నర్సింహారెడ్డి ఎంపీటీసీ సభ్యులు తెరాస నాయకులు ..కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# అన్నదానం చాలా గొప్పది.. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి





కరీంనగర్ , ఆగష్టు 23: అన్ని దానాల్లో కన్నా అన్నదానం చాలా గొప్పదని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈరోజు శ్రీ సత్య సాయి నిత్యాన్న ప్రసాద సేవా పథకం ద్వారా చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగుల సహాయకులకు ఆపద సమయంలో ప్రతినిత్యం అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం నిరుపేదలు ప్రభుత్వాసుపత్రిలో చేరుతారని, వారి సహాయకులు పస్తులు ఉండకుండా సత్యసాయి సేవా సమితి ప్రతిరోజు అన్నదానం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తమ్మినేని క్రిష్ణయ్య కుటుంబాన్ని పరామర్శించిన తెరాస ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు

## – ధైర్యంగా ఉండాలని తమ్మినేని కుటుంబ సభ్యులకు ఎంపీ నామ భరోసా

ఖమ్మం, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన టీ.ఆర్.ఎస్ నాయకులు తమ్మినేని క్రిష్ణయ్య మృతి పట్ల టీ.ఆర్.ఎస్ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. మంగళవారం నాడు క్రిష్ణయ్య నివాసానికి వెళ్లిన ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తెరాస ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, అక్కడ ఏర్పాటు చేసిన క్రిష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు, ఎంపీపీ ఉమ, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, బీరెడ్డి నాగచంద్ర రెడ్డి, జొన్నలగడ్డ రవి, చిత్తారు సింహాద్రి యాదవ్, బండి జగదీష్, వెన్నపూసల సీతారాములు, మద్ది వీరారెడ్డి, మంకెన నాగేశ్వరరావు, మంకెన వెంకటేశ్వరరావు, కొప్పుల ఆంజనేయులు, నారపాటి రమేష్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




నాద తనుమ్ అనిశం - చిత్తరంజనం
డా. మహాభాష్యం చిత్తరంజన్ గారి 'జీవిత ఔన్నత్య శిఖర' గ్రంథావిష్కరణ మరియు కనకాభిషేకము

ముఖ్యఅతిథి
డా. కె. ఐ. వరప్రసాద్ రెడ్డి
('పద్మభూషణ్' అవార్డు గ్రహీత, వ్యవస్థాపకులు - శాంతా బయోటెక్)

గౌరవ విశిష్ట అతిథి
శ్రీమతి మల్లాది శైలజా సుమన్
(విశ్రాంత ఉన్నతాధికారిణి, ఆకాశవాణి & దూరదర్శన్)

ఆత్మీయ అతిథులు
శ్రీ సుధామ
(ప్రముఖ కవి, రచయిత, విశ్రాంత అధికారి - ఆకాశవాణి)
శ్రీ కలగ కృష్ణమోహన్
(ప్రముఖ సంగీత స్వరకర్త, గేయ రచయిత, విశ్రాంత అధికారి, ఆకాశవాణి)

సభా కార్యక్రమములు
పుస్తకావిష్కరణ మరియు అతిథుల ప్రసంగాలు
సంగీత విభావరి
శ్రీ చిత్తరంజన్ సంగీత ఝరి
వాగ్గేయకార వాణి
వందన సమర్పణ
కనకాభిషేకం ప్రాయోజకులు: శ్రీ బావట్ల వేంకట రాజా, కళాపోషకులు, హైదరాబాద్
ఇట్లు ఆహ్వాన కమిటీ

తేదీ : 27-08-2022
శనివారము
సా॥ 6 గం. లకు

సభాధ్యక్షులు
శ్రీ వోలేటి పార్వతీశం
(ప్రముఖ రచయిత, వక్త, విశ్రాంత అధికారి, దూరదర్శన్)

వేదిక:
తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియం
పబ్లిక్ గార్డెన్స్ రోడ్
అసెంబ్లీ మెట్రో స్టేషన్ దగ్గర
హైదరాబాద్

YouTube Live Coverage by Trinet
అందరూ ఆహ్వానితులే...
కార్యక్రమం అనంతరం అల్పాహార విందు ఉంటుంది


# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి గుమ్మనూరు జయరాం



అమరావతి, ఆగష్టు 23: డలం బంటనహాల్ గ్రామంలో అభివృద్ధి ఫలాలు అందించడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ సుశీలమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పూలమాల, శాలువాత సన్మానంతో గ్రామంలోనికి ఆహ్వానించారు. అనంతరం సుంకులమ్మ దేవాలయం, ఆంజనేయ దేవాలయంలో సుంకులమ్మ దేవి, వినాయక విగ్రహం, ఆంజనేయ స్వామి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్టాపన సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం 10 లక్షలతో నిర్మించునున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఒక కోటి 87 లక్షలు ఇప్పటివరకు అందించమని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపగడప సంక్షేమ ఫలాలను వివరిస్తూ పాల్గొన్నారు.

# అదానీ చేతికి 'ఎన్డీటీవీ.. 45 శాతం వాటా కొనుగోలు..

హైదరాబాద్, ఆగష్టు 23: ఒక రంగం నుంచి మరో రంగానికి.. ఒక సెక్టార్ నుంచి మరో సెక్టార్‌లోకి అడుగులేస్తున్న భారత బిలియనీర్ గౌతం అదానీ.. ఇప్పుడు దేశంలోనే ప్రముఖ వార్తా చానెల్ ఎన్డీటీవీ ( ఔవలి ఆవశ్రీష్త్రతి ఎవశ్రీవలతిబతినీని ? ఔఆుఎ ) ని టేకోవర్ చేయబోతున్నారా.. అంటే అవుననే సమాధానమే వస్తుంది. పరోక్షంగా 29.18 శాతం వాటా కొనుగోలు చేశారు. ఇక ఓపెన్ ఆఫర్ ద్వారా మరో 26 శాతం వాటా కొనుగోలు చేయనున్నారని వార్తలొచ్చాయి. అదానీ గ్రూప్ .. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ ఏఎంఎన్ఎల్ ఈ వాటా కొనుగోలు చేసినట్లు తెలిపింది.

ఏఎంజీ మీడియా నెట్‌వర్క్స్ అండ్ అదానీ ఎంటర్‌ప్రైజెస్‌తోపాటు విశ్వప్రధాన్ కమర్షియల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు రూ.294లకు వాటా చొప్పున 1,67,62,530 ఫుల్లీ పెయిడ్అప్ ఈక్విటీ షేర్ల కొనుగోలుకు ఓపెన్ ఆఫర్ చేశాయి. ఈ మూడు సంస్థల తరపున జేఎం ఫైనాన్సియల్స్ ఒక బహిరంగ ప్రకటన చేసింది. సెబీలోని రెగ్యులేషన్ 8 (2) నిబంధన ప్రకారం తమ ఆఫర్ ధర ఎక్కువనని పేర్కొంది.

అదానీ మీడియా సంస్థ అదానీ మీడియా నెట్‌వర్క్స్ లిమిటెడ్ (ఏఎంఎన్ఎల్) పరోక్షంగా ఎన్డీటీవీలో 29.18 శాతం వాటా కొనుగోలు చేసింది. ఆర్ఆర్పీఆర్‌లో 99.99 శాతం వాటాను ఏఎంఎన్ఎల్ అనుబంధ వీసీపీఎల్ టేకోవర్ చేయనున్నది. ఎన్డీటీవీ ప్రమోటర్ సంస్థగా ఆర్ఆర్పీఆర్ 29.18 శాతం వాటా కలిగి ఉంది.

ఇదిలా ఉంటే బీఎస్ఈలో ఎన్డీటీవీ యాజమాన్యం ఒక స్టేట్‌మెంట్ ప్రకటన చేసింది. ఎన్డీటీవీలో వాటాలా ఉపసంహారణ, యాజమాన్య హక్కుల బదిలీపై రాధిక గానీ, ప్రణయ్ రాయ్ గానీ ఎటువంటి చర్చల్లో పాల్గొనడం లేదని తెలిపింది. వాటాదారుల ప్రయోజనాల కోసం ఈ వివరణ ఇస్తున్నట్లు వివరించింది.

ఎన్డీటీవీలో 61.45 శాతం వాటా ఆర్ఆర్పీఆర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కొనసాగించాలని నిర్ణయించినట్లు ఎన్డీటీవీ తెలిపింది. ఎన్డీటీవీ వ్యవస్థాపక ప్రమోటర్లు తమ ఆర్ఆర్పీఆర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తమ వాటాను విక్రయిస్తున్నారా.. ఒక జర్నలిస్టు అడిగిన ప్రశ్నపై బీఎస్ఈలో ఫైలింగ్ చేశామని తెలిపింది. తమ సంస్థలు వాటాలు విక్రయిస్తున్నట్లు వచ్చిన వార్త పూర్తిగా నిరాధారమైందని స్పష్టం చేసింది.

# 5వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోండి

మెదక్, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి):2022–23 విద్యా సంవత్సరానికి బోయిన్ పల్లి లోని వాటర్ స్పోర్ట్స్ అకాడమి క్రీడా పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కేశూరం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి ఉత్తీర్ణులై 5వ తరగతి చదువుచున్న ఐ.టి.డి.ఏ మైదాన ప్రాంత జిల్లాలకు చెందిన బాలబాలికలు ఈ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి అర్హులని ఆయన తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాండ్ జంప్ , వర్టికల్ జంప్, మెడిసిన్ బాల త్రో, 800 మీటర్ల పరుగు పందెం తదితర పోటీలు నిర్వహించి పూర్తి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మండల స్థాయిలో సెప్టెంబర్ 1 నుండి 3 వరకు మైదాన ప్రాంతా జిల్లాలలోని మండలాలలో, జిల్లా స్థాయి ఎంపికలు సెప్టెంబర్ 8,9 తేదీలలో జిల్లా కేంద్రాలనందు ఎంపిక జరుగుతాయని ఆయన తెలిపారు. తుది ఎంపిక సెప్టెంబర్ 20 నుండి 23 తేదీలలో హైద్రాబాద్ లోని హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ నందు జరుగుతాయని కేశూరం పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన బాలబాలియాకలకు ప్రత్యేకమైన ఆహారం, వసతి, స్పోర్ట్స్ దుస్తులు, షూస్ ఇచ్చి కయాకింగ్, కేనోయింగ్, సెయిలింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్ నందు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వాటర్ స్పోర్ట్స్ అకాడమిలో ప్రవేశానికై ఆసక్తి గల బాలబాలికలు రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ సర్టిఫికెట్ లతో ఈ నెల 30 లోగా మెదక్ కలెక్టరేట్ లోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించవలసినదిగా కేశూరం తెలిపారు.

# పది లక్షల రూపాయలు చెక్కులను అందజేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



ఖమ్మం, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి): సత్తుపల్లి నియోజకవర్గం తల్లాడ మండలం, బిల్లుపాడు గ్రామానికి చెందిన తల్లి నస్మీన్, కుమారుడు సైదా, ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో మృతి చెందారు. ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సంబంధిత విద్యుత్ శాఖతో మాట్లాడి మంజూరైన ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున 10 లక్షల రూపాయల చెక్కులను మృతుల కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య బిల్లుపాడు గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదవశాత్తు ఒకే కుటుంబంలో తల్లి, కుమారుడు మృతి చెందడం బాధాకరమైన విషయం అని వారి కుటుంబాన్ని ఆదుకోవాలని వారికి టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో ఒక్కకరికి 2 లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కులను మంజూరు చేయించి 4 లక్షల రూపాయల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు కొన్ని నెలల క్రితం వారి ఇంటికి వెళ్లి అందజేయడం జరిగిందని, అదేవిధంగా స్వతహాగా కొంత ఆర్థిక సహాయం అందించడం, గ్రామ నాయకులు కూడా వారి కుటుంబాన్ని ఆదుకున్నారని తెలిపారు. అదేవిధంగా సంబంధిత విద్యుత్ శాఖతో మాట్లాడి ప్రమాదానికి నష్టపరిహారనీ చెల్లించాలని కోరగా మృతులకు మంజూరైన ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చెక్కులని మృతుల కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు.

అదేవిధంగా ఈనెల 24వ తారీఖు నుండి 29వ తారీకు వరకు మొదట విడతగా ప్రభుత్వ పథకాలను నేరుగా వారి వద్దకే వెళ్లి పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతోపాటు, నూతనంగా మంజూరు అయిన 57 ఏళ్ల వృద్ధాప్య మరియు వితంతు పెన్షన్లదారులకు పెన్షన్ కార్డులను అందజేయడం జరుగుతుందని కార్యక్రమంలో భాగంగా తల్లాడ మండలంలో ఈ నెల 27వ తారీఖు నాడు గ్రామాల్లో గ్రామ పంచాయతీలో సభ ఏర్పాటు చేసి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

# నేడు జిల్లాలో పొంగులేటి పర్యటన



ఖమ్మం, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి): తెరాస రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంఛార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా, ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇటీవల జరిగిన వివాహాది శుభకార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులకు తన ఆశీర్వాదాన్ని అందజేస్తారని తెలిపారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు అధిక సంఖ్యలో హాజరై పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# ఇద్దరు పిల్లలను కాలువలో తోసేసిన తండ్రి..!

అమరావతి, ఆగష్టు 23: కర్నూలు జిల్లాలోని కోడుమూరు గ్రామంలో భార్యపై అనుమానంతో భర్త తన ఇద్దరు పిల్లలను తీసుకెళ్లి ఆటోతో సహా ప్యాలకుర్తి వద్ద కాలువలో పడేసి అక్కడి నుంచి పారి పోయాడు. ఆ సమయంలో నీరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో పోలీసులు పిల్లలను సురక్షితంగా బయటకు తీశారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సేవ
తెలుగుభాష సాహితీ సేవా సంస్థ
సాహితీ వేదిక
సాహితీ సదస్సు - కవితోత్సవం
29 ఆగస్టు 2022, సోమవారం ఉదయం 9.00 గంటలకు
వేదిక : రవీంద్రభారతి - హైదరాబాద్
ముఖ్య అతిథి: గా॥ ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
(సుప్రసిద్ధ కవి, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి)
విశిష్ట అతిథి: గా॥ బైస దేవదాసు
(సుప్రసిద్ధ పాత్రికేయులు, నేటి నిజం పత్రికా సంపాదకులు, హైదరాబాద్)
అధ్యక్షులు : గా॥ సుధామ
(సుప్రసిద్ధ కవి, రచయిత, కార్టూనిస్టు, పజిల్స్ నిర్మాత)
గౌరవ అతిథి : గా॥ డా. అడువాల సుజాత
(సుప్రసిద్ధ కవయిత్రి)
ఆత్మీయ అతిథి: గా॥ మద్దాళి రఘురాం
(సుప్రసిద్ధ సాహితీ వేత్త, కిన్నెర ఆర్ట్ థియేటర్ కార్యదర్శి, హైదరాబాద్)
స్వాగతం: డా. కొణిదెల శోభ సమన్వయకర్త సేవ
వందన సమర్పణ: టంగుటూరు పుష్పలత సమన్వయకర్త, సేవ
సభానంతరం కవి సమ్మేళనం -
కవులకు అభినందన పురస్కారం


# కేసీఆర్ కుటుంబం కోసం ఏ త్యాగానికైనా సిద్ధం : మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



వరంగల్, ఆగష్టు 23: ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై ఈగను కూడా వాలనీయమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. కేసీఆర్ వెంటే మొత్తం తెలంగాణ ప్రజానీకం ఉందన్నారు. రాష్ట్రం కోసం త్యాగాలు చేసిన ఆ కుటుంబం కోసం ఏ త్యాగానికైనా పార్టీ మొత్తం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పారు. మచ్చలేని కేసీఆర్ కుటుంబంపై బీజేపీ విషం చిమ్ముతుందని మండిపడ్డారు. బీజేపీ ఆటలు తెలంగాణలో సాగనీయమని హెచ్చరించారు. కల్వకుంట్ల కవిత కుటుంబానికి ఉమ్మడి వరంగల్ జిల్లా సంఘీభావంగా ఉందన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, నన్నపనేని నరేందర్, వరంగల్ మహానగర మేయర్ వరంగల్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజ్ తదితరులతో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వరంగల్ హన్మకొండలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితను ఇరికించాలనుకోవడం సరికాదన్నారు. కవిత జోలికి వస్తే యావత్ తెలంగాణ కన్నెర్ర చేస్తుందని హెచ్చరించారు. కవిత ఇంటిపై బీజేపీ గూండాలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు దయాకర్ రావు పేర్కొన్నారు. మొన్న పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పులలో బండి సంజయ్ బౌన్సర్లు, గూండాలు టీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేశారు. ఇవాళ జనగామ జిల్లాలో విధ్వంసం సృష్టించడానికి బండి సంజయ్ కుట్ర పన్నారు. టీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేయమని బీజేపీ వాళ్ళను రెచ్చగొట్టి, ఉసి గొల్పాడు. చివరకు పోలీసులనే బెదిరించి, రౌడీయిజానికి దిగాడు. పోలీసులను బెదిరిస్తే వాళ్ళు ఊరుకుంటారా? చట్టం ఎవరికీ చుట్టం కాదు? తన పని తాను చేసుకుపోతున్నదని మంత్రి ఎర్రబెల్లి పేర్కొన్నారు. దేశంలో మోదీ, అమిత్ షాల అరాచకాలకు హద్దు లేకుండా పోతోందన్నారు. వారిని ప్రశ్నిస్తున్నందుకే? సీఎం కేసీఆర్, ఆయన కుటుంబంపై బీజేపీ దాడులకు దిగుతున్నదని తెలిపారు. మోడీ, అమిత్ షాలపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గర పడ్డాయి. మీ లాంటి చిల్లర రాజకీయాలకు కేసీఆర్ భయపడరని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు.

# బీజేపీకి అడ్డుకట్ట వేస్తాం.. మునుగోడులో టీఆర్ఎస్‌ను గెలిపిస్తాం : సీపీఐ




యాదాద్రి భువనగిరి, ఆగష్టు 23: రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకై మతోన్మాద బీజేపీకి తెలంగాణలో అడ్డుకట్ట వేయడమే కమ్యూనిస్టుల కర్తవ్యం అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు.

మంగళవారం భువనగిరి పట్టణం, రాయగిరిలో భారత కమ్యూనిస్టు పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎలాంటి పాత్ర పోషించని బీజేపీ నాయకులు అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పడం సిగ్గుచేటుగా ఉందన్నారు. నిజాం రజాకార్ల అకృత్యాలకు, దొరల దురాగాతలకు ఎదిరొడ్డి భూస్వామ్య పరిపాలనకు చరమగీతం పాడేందుకు నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు అమరవీరులయ్యారని, సాయుధ పోరాటం 4 వేల గ్రామాలను విముక్తి చేయడంతో పాటు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఉద్యమ చరిత్రను బీజేపీ వక్రీకరించేందుకు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ ముస్లింల మధ్య జరిగిన గొడవగా బీజేపీ చిత్రీకరించే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

దేశ స్వాతంత్ర సంగ్రామ చరిత్రను సైతం బీజేపీ వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజలకు అచ్చే దిన్ తీసుకువస్తానని అధికారంలోకి వచ్చిన మోదీ ప్రజలకు సచ్చేదిన్ తీసుకువచ్చి కార్పొరేట్ శక్తులకు మాత్రం మంచి రోజులు తీసుకువచ్చారని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని సంపన్నులకు రూ. 12 లక్షల కోట్ల బకాయిలను రద్దు చేశారని, పేదలకు ఇచ్చే ఉచితాలను ప్రభుత్వ ఖజానాకు భారమని చర్చకు తెరలేపి దేశంలో సంక్షేమ పథకాలు లేకుండా చేయాలని బీజేపీ చూస్తున్నదని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను రాత్రికి రాత్రి కొనుగోలు చేస్తూ ప్రభుత్వాలను మార్చి ప్రజాస్వామ్యాన్ని అభాసుపాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని నాశనం చేస్తున్న బీజేపీని పారద్రోలడానికి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

మునుగోడులో టీఆర్ఎస్ గెలుపు ఖాయం

మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని పల్లా వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

మునుగోడు శాసనసభకు సీపీఐ ఐదు సార్లు ప్రాతినిధ్యం వహించిందని, తమకు అన్ని గ్రామాల్లో ఓటు బ్యాంకు ఉందన్నారు. 25 వేలకు పైగా ఉన్న తమ ఓటు బ్యాంకు టీఆర్ఎస్ అభ్యర్థికి అనుకూలంగా మారడం వల్ల ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపు నల్లేరుపై నడకేనని వివరించారు. బీజేపీ ఎన్ని డబ్బులు పంచినా, ఎన్ని కుట్రలు చేసినా మునుగోడులో గెలవడం కష్టమన్నారు.

# బయో పెట్రోల్ పంపులను ప్రారంభించిన మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి, ఆగష్టు 23: కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ బయో పెట్రోల్ వినియోగించాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచించారు. వనపర్తి జిల్లాలోని నాగవరం, అంకుర్ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బయో పెట్రోల్ పంపులను మంత్రి నిరంజన్ రెడ్డి, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష కలిసి మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆగ్రో పెట్రోల్ పంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కొరకు బయో పెట్రోలు ప్రతి ఒక్కరు వాడాలని మంత్రి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బయో పెట్రోలు ఉత్పత్తులను పెంచి త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# రోజూ డేట్స్‌ను తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం సొంతం

న్యూఢిల్లీ, ఆగష్టు 23: ప్రతిరోజూ రెండు, మూడు డేట్స్‌ను ఆహారంలో భాగంగా తీసుకుంటే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. సాయంత్రం స్నాక్స్ కింద డేట్స్‌ను తీసుకుని మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని సూచిస్తున్నారు. డేట్స్ రక్తనాళాల్లో పేరుకుపోయే వ్యర్థాలను తొలగిస్తాయి. ధమనులు మూసుకుపోయేలా పేరుకుపోయే లైమ్‌ను ఖర్జూర పండ్లు తొలగిస్తాయి. దీంతో స్ట్రోక్‌లు, గుండె పోటు, ఇతర వ్యాధుల ముప్పు నుంచి డేట్స్ కాపాడతాయి. రోజుకు మూడు డేట్స్ తీసుకోవడం ద్వారా తీవ్ర అనారోగ్యాల బారిన పడే ముప్పు తగ్గుతుంది. ఇక కాలేయాన్ని కూడా ఖర్జూరాలు ఆరోగ్యంగా ఉంచుతాయని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. గుండెకు ఖర్జూరాలు ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే పొటాషియం కార్డియోవాస్క్యులర్ జబ్బులను నిరోధిస్తుంది. ఇది శరీరంలో పేరుకుపోయే ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా స్ట్రోక్, గుండెపోటు ముప్పు నియంత్రిస్తుంది. డేట్స్‌లో ఉండే విటమిన్ ఏ కండ్ల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. హానికారక యూవీ రేస్‌తో పోరాడుతుంది. స్నాక్స్‌లా డేట్స్‌ను తీసుకుంటే తక్షణ శక్తి సమకూరుతుంది. డేట్స్‌లో ఉండే ఔషధ గుణాలు శరీరంలో టాక్సిన్స్‌ను బయటకు పంపడమే కాకుండా ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. అమినో ఆమ్లాలు జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తాయి. ఇక డేట్స్‌లో ఉండే మెగ్నీషియం శరీరంలో నొప్పిని, వాపు నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

# గతి శక్తి విశ్వవిద్యాలయం ఏర్పాటుపై కేంద్రం నోటిఫికేషన్

న్యూఢిల్లీ, ఆగష్టు 23: వడోదర కేంద్రంగా గతి శక్తి విశ్వవిద్యాలయం ఏర్పాటుకానున్నది. ఈ మేరకు మంగళవారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటివరకు వడోదర కేంద్రంగా ఉన్న నేషనల్ రైల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ యూనివర్శిటీని గతి శక్తి విశ్వవిద్యాలయ పేరుతో సెంట్రల్ వర్శిటీగా మార్చేందుకు కేంద్రం నిర్ణయం తీసుకున్నది.

ఈ చట్టంలోని మొదటి షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా గతి శక్తి విశ్వవిద్యాలయం టెరిటోరియల్ జ్యూరిస్‌డిక్షన్ మన దేశం మొత్తానికి విస్తరించారు. ఈ విశ్వవిద్యాలయానికి రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చనున్నది. వడోదరలోని నేషనల్ రైల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన, అన్ని స్థిర, అస్థిర ఆస్తులు ఈ చట్టం క్రింద స్థాపితమైన గతి శక్తి విశ్వవిద్యాలయం పరిధిలో ఉంటాయి. అలాగే, ఇన్‌స్టిట్యూట్ అన్ని హక్కులు, బాధ్యతలను కూడా ఈ చట్టం ప్రకారం గతి శక్తి విశ్వవిద్యాలయానికి బదిలీ అవుతాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నది.

మల్టీ–మోడల్ కనెక్టివిటీ కోసం కేంద్రం ప్రతిష్టాత్మకంగా రూ. 100 లక్షల కోట్లతో ప్రధానమంత్రి గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ పేరుతో ఈ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నది. రవాణా, సాంకేతికత, నిర్వహణకు సంబంధించిన వివిధ విభాగాలలో ఉన్నత నాణ్యత బోధన, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి ఈ విశ్వవిద్యాలయం చర్యలు తీసుకోనున్నది. రానున్న రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల్లో కూడా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కూడా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తున్నది.

# బహుముఖ ప్రజ్ఞాశాలి కొత్వాల్ వెంకట్రామ్‌రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 23: సమాజానికి దివంగత మాజీ కొత్వాల్ రాజాబహదూర్ వెంకటరామ రెడ్డి అందించిన సేవలు నేటి తరానికి మార్గదర్శమని నగర పోలీస్ కమిషనర్ సీవీ. ఆనంద్ అన్నారు. రాజాబహదూర్ వెంకటరామ రెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రాజా బహదూర్ వెంకటరామ రెడ్డి 153వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలోని కొత్వాల్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం సీవీ. ఆనంద్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో విద్య అవకాశాలు లేని సమయంలో విద్యా సంస్థలు, వసతి గృహాలను స్థాపించి ఎంతో మందికి విద్యను అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి రాజా బహదూర్ వెంకటరామరెడ్డి అని కొనియాడారు. నగర కొత్వాల్‌గా బాధ్యతలు చేపట్టి ఏకదాటిగా 14 సంవత్సరాలు పనిచేసి నిజాం ప్రభుత్వం మన్నలను పొందారని గుర్తు చేశారు.

భాగ్యనగరం నడిబొడ్డున మహిళల కోసం ప్రత్యేకంగా కళాశాల, హాస్టల్‌ను ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. రాజాబహదూర్ వెంకటరామ రెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగి తెలంగాణను మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రతిపౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందిస్తున్న హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఎస్సై యు. మదన్‌కుమార్‌గౌడ్, సైబరాబాద్, ఆమన్‌గల్ సర్కిల్ సీఐ జె. ఉపేందర్‌రావును వెంకటరామ రెడ్డి గోల్డ్ మెడల్స్‌తో సత్కరించి, ఐదువేల నగదు చెక్కును అందజేశారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొండా లక్ష్మీ కాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మట్టా రెడ్డి, ప్రతినిధులు కొండా రామచంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నారాయణగూడ పీఎస్ సీఐ రాపోల్ శ్రీనివాస్‌రెడ్డి, డీఐ రవికుమార్, ఎస్సైలు నాగరాజు, జ్యోతి, ప్రదీప్, నాగరాజు, నరేశ్, షఫీ, నారాయణగూడ ట్రాఫిక్ సీఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో పంట కాల్వలో కారు బోల్తా, ముగ్గురు మృతి

అమరావతి, ఆగష్టు 23: పంట కాల్వలో కారు బోల్తా పడిన సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన ఏలూరు జిల్లా గణపవరం మండలం వల్లూరు–అర్ధవరం గ్రామాల మధ్య సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. మృతులంతా మహిళలే. వీరంతా భీమవరం కొత్త బస్టాండ్ ప్రాంతానికి చెందినవారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

భీమవరం కొత్త బస్టాండ్ సమీపంలో నివసించే మహబూబ్ బాషా బంధువుల వివాహం ఏలూరులో జరిగింది. ఈ వివాహానికి హాజరయ్యేందుకు అమరజహాన్ (50), మహ్మద్ షంషాద్ (55), ఫాతిమా జహర్బీ (45) తోపాటు అమర్‌జహాన్ కుమారుడు కమల్ బాషా, ఎండీ రహీమాలు కారులో బయల్దేరారు. వివాహం అనంతరం తాడేపల్లిగూడెంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి రాత్రి 8 గంటలకు కారులో భీమవరం బయలుదేరారు. వల్లూరు వద్ద రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొని పంట కాల్వలోకి దూసుకెళ్లింది.

స్థానికులు వెంటనే కారులో ఉన్న వారిని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కారు నీటిలో సగం వరకు మునిగిపోవడంతో కారులో ఉన్న అమర్‌జహాన్, మహ్మద్ షంషాద్, ఫాతిమా జహర్బీ అనే ముగ్గురు మహిళలు ఊపిరాడక కారులోనే చనిపోయారు. కారు నడుపుతున్న అమర్‌జహాన్ కుమారుడు కమల్‌బాషా, ఎండీ రహీమాలను స్థానికులు రక్షించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్‌లో చిన్న గొడవలే.. మునుగోడు అభ్యర్థి ఎంపిక బాధ్యత వారిదే: ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, ఆగష్టు 23: కాంగ్రెస్ కీలక నేత ప్రియాంక గాంధీతో ఆ పార్టీ నేతలు రెండు గంటలకుపైగా భేటీ అయ్యారు. ఒక్కొక్క నేతతో 10–15 నిమిషాలపాటు ప్రియాంక మాట్లాడినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యవహారాలను పరిశీలిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. నేతల మధ్య చిన్న చిన్న విభేదాలే తప్ప పెద్ద సమస్యలేవీ లేవని ఆమె చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవచ్చని ప్రియాంక తెలిపారు.

మరికొన్ని రోజుల్లో జరగనున్న మునుగోడు ఉపఎన్నికలో పార్టీ అభ్యర్థిని ఎంచుకునే బాధ్యతను నల్లగొండ నేతలకే అప్పగించినట్లు చెప్పారు. కోమటిరెడ్డితో మాట్లాడాలని రాజనర్సింహ, మధుయాష్కీలను పురమాయించారు. పరస్పరం సహకారం ఉంటేనే పార్టీ గెలుస్తుందని ప్రియాంక అన్నారు. అందరినీ కలుపుకొని పోవాలని రేవంత్ రెడ్డికి సూచించారు.

# జీవన గమనంలో ఓ మజిలీ పుస్తకావిష్కరణ-యం భాగ్య లక్ష్మి



హైదరాబాద్, ఆగష్టు 23: తత్వవేత్త రచయిత మా అందరి ఆదర్శం ఉద్యమ నేత తెలంగాణ తొలి బీసీ కమిషన్ చైర్మన్గా ఆయన సేవలు అభినందనీయం . ఈరోజు 74వ పుట్టిన దినం సందర్భంగా జీవన గమనంలో ఓ మజిలీ అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్ పర్సన్ యం భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఈ పుస్తకావిష్కరణ లో డాలవింజమూరి సూర్య ప్రకాష్ ( అందరి ఇల్లు)బి ఎస్ రాములు , శ్రీమతి శ్యామల , సినీ నిర్మాత దర్శకులు అంకుశం చిన్నా పాల్గొన్నారు. అన్నగారి జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నాను 60ఏళ్లుగా నిరంతరం ప్రతిక్షణం బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేస్తూ బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం తన కలాన్ని జీవితాన్నిమా అందరి కోసం రేపటి భావితరాల భవిష్యత్తు కోసం పుస్తకాలను రచించి మా అందరికీ జ్ఞానానందించినటువంటి మా పెద్దలు గౌరవనీయులు మాన్యశ్రీ బేతి శ్రీరాములన్నకు ధన్యవాదాలు. మేము ఆయన ఆశీర్వాదం కోరుతూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆశీర్వాదం మేము తీసుకుంటూ నిరంతరం ఆయన సేవలు అయిన పుస్తకం ద్వారా చేసినటువంటి రచనలు ఈ సూర్యచంద్రు దు ఈ సూర్యచంద్రులు ఉన్నంత వరకు ముందు ముందు ఫెడరల్ స్ఫూర్తిగా దేశము రాష్ట్రంలో ఏ విధంగా పరిపాలన చేయాలో పుస్తకం ద్వారా అందించి నిజంగా మా అందరికీ కూడా ఒక పెద్ద ఆదర్శంగా ఉండి ఆయన వందేళ్లు ఆయురారోగ్యంగావందేళ్లు ఆయురారోగ్యంగా ఉండాలని మాలాంటి అందరికీ ఆయన ఆశీస్సులు ఉండాలని చెప్పేసి భగవంతుని ప్రార్థన చేస్తూ 74వ జన్మదినంగా ఆయనకు వందనాలు. ?– యం. భాగ్యలక్ష్మి ఓబీసీ సెంట్రల్ కమిటీ ఓ బి సి సెంట్రల్ కమిటీ అండ్ జాతీయ బీసీ మహిళా సమాఖ్య ఫౌండర్ ప్రెసిడెంట్ చైర్ పర్సన్

# ఈసారి చంద్రబాబు కూడా ఎమ్మెల్యేగా గెలవరు.. కొడాలి నాని

అమరావతి, ఆగష్టు 23: రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు కూడా ఎమ్మెల్యేగా గెలవలేరని వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ? ఎన్టీఆర్, చిరంజీవి పేర్లు వాడకుండా ఎన్నికలకు వెళ్తే.. పవన్ కళ్యాణ్, చంద్రబాబు గుండుసున్నాతో సమానమన్నారు. పవన్, చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఒక్కశాతం ఓటు లేదన్నారు. 60శాతం ఓటింగ్ ఉన్న జగన్ ను ఏం చేయలేరన్నారు. 2024 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో టీడీపీ, జనసేన పీడ విరగడవుతుందన్నారు.

# సున్ని మర్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబి సన్నాహక సమావేశం



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి): వచ్చే నెలలో నిర్వహించబోయే మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల సందర్భంగా మిలాదున్నబి ఆధ్యాత్మిక సదస్సులు.. ర్యాలీ నిర్వహణ కోసం మంగళవారం సున్నీ మర్కజి మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హఫెజ్ మోయుజోద్దీన్ ఖాదిరి (యూసుఫ్) ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈసందర్భంగా హఫిజ్ సయ్యద్ ముయుజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్ మాట్లాడుతూ పవిత్ర రబీ ఉల్ అవ్వల్ మాసానికి సంబంధించి నెలవంక దర్శనంతో మొదలు 12 రోజులు, 12 ప్రాంతాల్లో, ఆధ్యాత్మిక సదస్సులు (జల్సా) ఉంటాయన్నారు.

చివరి రోజు జామా మసీదు నుండి రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా, కమాన్ బస్టాండ్ మీదుగా రాజీవ్ చౌక్ అస్లమి మజీద్ చేరుకొని హజ్రత్ సయ్యద్ కరీముల్లా షా రహ్మతుల్లా అలైహి దర్గా వద్ద ర్యాలీ ముగుస్తుందన్నారు. షబే నూర్ రోజు ముఖ్యమైన జల్సా ఆధ్యాత్మిక సదస్సుకు ముఫ్తి హమ్మాద్ రజా మురాదాబాది వస్తున్నారని తెలిపారు. కరీంనగర్ ముస్లింలు పెద్ద ఎత్తున ఈ ఆధ్యాత్మిక సదస్సులకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జామా మసీదు అధ్యక్షుడు రియాజ్ ఖాద్రి, మౌలానా అబ్దుల్ ఖయ్యూం జియాయి, హాఫీజ్ సోహెల్ బిన్ అబ్దుల్లా ఖాద్రీ, హాఫీజ్ మహమ్మద్ అబ్దుల్ ఖదీర్ ఖాదిరి, సలావుద్దీన్ ఖాదిరి, సోహెల్ రజ్వి, ఖాజా మొయినుద్దీన్, హాఫీజ్ ఖాజాబాబా, అయ్యూబ్ ఖాన్, యూసుఫ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# మర్రిగడ్డ లో మేగా వైద్య శిభిరం...




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచి నేతికుంట జలపతి ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జలపతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వైద్య శిబిరాలతో నిరుపేదలకు కార్పోరేట్ వైద్యం చేరువ అవుతుం దని అన్నారు. మెడికవర్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ వైద్య శిభిరంలో మందుల తో పాటు టెస్టుల నిర్వహణతో పేద ప్రజల ఆరోగ్యం పట్ల ఆందోళన చెందకుండా ఉండే వీలు కలుగుతు దన్నారు. ఉత్తర తెలంగాణలోనే ముగ్గురు గుండె వైద్య నిపుణులను కలిగివుండి ఎల్లవేళలా అన్ని రకాల స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్న ఏకైక ఆసుపత్రి మెడికవర్ అన్నారు . 100 మందికి ఈసీజీ , బీపీ, షుగర్, పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరం లో వైద్యులు డా.పూజిత్ ఆసుపత్రి ఎక్జిక్యూటివ్ లక్ష్మీరాజ్యం , క్యాంప్ కోర్డినేటర్ కిరణ్ తిరుపతి, నిఖిల్, వసరయ్య, తిరుప తి,శ్రీనివాస్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాల్లో మెడిసిన్ కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు

హైదరాబాద్, ఆగష్టు 23: వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అనారోగ్యంతో ఆసుపత్రులకువచ్చే రోగులకు సకాలంలో వైద్య చికిత్సతోపాటు మందుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పకడ్బంధీ చర్యలు తీసుకుంటోంది. రోగుల మందుల కోసం ప్రయివేటు మెడికల్ షాపుల గడప తొక్కకుండా ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పంపిణీ చేసే మందుల సంఖ్యను పెంచిన వైద్య, ఆరోగ్యశాఖ, ప్రభుత్వం? ఇప్పుడు తాజాగా రాష్ట్రంలో పలు జిల్లాల్లో కొత్తగా మందుల నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయబోతోంది.

వీహెచ్సీ మొదలు జిల్లా ఆసుపత్రి, హైదరాబాద్లోని పెద్దాసుపత్రి వరకు మందుల పంపిణీ మెడికల్ చెయిన్ను పకడ్బంధీగా నిర్వహించేందుకు కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మెడికల్ నిల్వ కేంద్రాలు ఉపయోగపడనున్నాయని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కొత్తగా భూపాలపల్లి, సిద్ధిపేట, జగిత్యాల, మంచిర్యాల, నాగర్కర్నూలు, సూర్యాపేట, వికారాబాద్, గద్వాల జిల్లాల్లో మెడికల్ కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయనుంది. మందుల పంపిణీ సమయంలో అవి పాడుకాకుండా స్టోరేజీ నుంచి సకాలంలో రోగులకు అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేకమైన చైన్ సిస్టమ్ పద్ధతిని అవలంభించాల్సి ఉంటుంది. మెడిసిన్స్ పాడుకాకుండా ఉండేందుకు వాటిని నిర్దిష్ట ఉష్ణోగ్రతల వద్దే కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచడమనేది అత్యంత కీలకం. ప్రస్తుతం రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్ ఎంజీఎం, ఆదిలాబాద్, మహబూబ్నగర్ తదితర ఉమ్మడి

జిల్లాల్లోనే మందుల నిల్వ గిడ్డంగులు అందుబాటులో ఉన్నాయి. అయితే ఇవి మారుమూల ప్రాంతాల్లోని పీహెచ్సీలకు చేరే సరికి వాటి నాణ్యత దెబ్బతింటున్న పరిస్థితులతోపాటు సకాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచడం కూడా కష్ట మవుతోంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో కొత్తగా మెడికల్ స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్రావు అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు చేయబోతున్న స్టోరేజీల్లో అవసరమైన డీ ఫ్రీజర్లు, ప్రత్యేకంగా ఫార్మాసిస్టు, మందులను వేగంగా ఆసుపత్రులకు పంపిణీ చేసేలా కోల్డ్ స్టోరేజీ ఏర్పాట్లతో ఉన్న వాహనాలను ఇప్పటికే వైద్య, ఆరోగ్యశాఖ సిద్ధం చేసింది. దీంతో ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత తీరనుందని వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరిన రోగికి వ్యాధి నయమయి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లాక వినియోగించాల్సిన మందులను కూడా అందుబాటులో ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది. వైద్యుడు రాసిన ప్రిస్కిప్షన్లోని మందులన్నింటినీ రోగికి డిశ్చార్జి సమయంలో ఇచ్చి పంపాలని మంత్రి హరీష్రావు ఆదేశించారు. ఇందుకోసం ఈఎంఎల్ (ఎమర్జెన్సీ మెడికల్ లిస్టు), ఎఎంఎల్ జాబితాలోని మందులన్నింటినీ ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించారు. గతంలో ఈఎంఎల్, ఎఎంఎల్ జాబితా రెండు కలిపి 720 రకాల మందులు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్యను 843కు పెంచారు. కొత్తగా 123 రకాల మందులను వైద్య, ఆరోగ్యశాఖ కొనుగోలు చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లను ప్రత్యేకంగా కేటాయించింది. దీంతో ఇకమీదట ఆసుపత్రిలో ఉన్న సమయంలోనూ, డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లాక కూడా మందుల కోసం ప్రయివేటు మెడికల్ స్టోర్స్ కు వెళ్లాల్సిన అవసరం రోగులకు ఉండదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులను కూడా లేవన్న భావనతో ప్రభుత్వ వైద్యులు ప్రయివేటు మెడికల్స్కు రాసే పరిస్థితులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా మందుల వివరాలతో కూడిన హ్యాండ్ బుక్స్ ను ముద్రించాలని నిర్ణయించింది. ఇప్పటికే 1500 హ్యాండ్ బుక్స్ సిద్ధం అయినట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో ఈ మెడిసన్ హ్యాండ్ బుక్స్ ను మంత్రి హరీష్రావు చేతుల మీదుగా గాంధీ ఆసుపత్రి వైద్యులకు పంపిణీ చేయనున్నారు.

# హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు అన్నదానం



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 23: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండల కేంద్రంలోని జోడు ఆంజనేయస్వామి దేవాలయవార్షికోత్సవం. శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేసి గ్రామస్థుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక ఎం.పి.టి.సి పులి రేణుక సత్యం ఆద్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు గొట్టె ప్రభాకర్, మోతే బాబు. పిట్టల బాబు.లింగాల మల్లయ్య,సిరికొండ శ్రీనివాస్,పోతరాజు ఈశ్వర్,దెబ్బటి వెంకటేశం,కైర సాగర్,పులి నరేష్,చిలుక భూమేష్,రాజురి రవీందర్,పొంచెట్టి నర్సయ్య మార్త మల్లేశం పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు,

# ఆగస్టు 25వ తేదీ న 'స్మార్ట్ ఇండియా హాకథన్ 2022' తాలూకు గ్రాండ్ ఫినాలే ను ఉద్దేశించిప్రసంగించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 23: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆగస్టు 25 వ తేదీ నాడు రాత్రి 8 గంటల కు 'స్మార్ట్ ఇండియా హాకథన్ 2022' యొక్క గ్రాండ్ ఫినాలే ను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యమం ద్వారా ప్రసంగించనున్నారు.

దేశం లో ప్రత్యేకించి యువతీ యువకుల లో నూతన ఆవిష్కరణల కు సంబంధించినటువంటి స్ఫూరిని పెంపొందించేందుకు ప్రధాన మంత్రి నిరంతరం ప్రయాస లు చేస్తూ వస్తున్నారు. ఇదే దార్శనికత ను అనుసరిస్తూ, స్మార్ట్ ఇండియా హాకథన్ (ఎస్ఐహెచ్) ను 2017 వ సంవత్సరం లో మొదలు పెట్టడమైంది. ఎస్ఐహెచ్ అనేది సమాజం యొక్క, సంస్థల యొక్క మరియు ప్రభుత్వం యొక్క అనేక చిక్కు సమస్యల ను పరిష్కరించడాని కి విద్యార్థుల కు ఒక వేదిక ను సమకూర్చేటటువంటి ఒక దేశవ్యాప్త కార్యక్రమం గా ఉన్నది. ఇది విద్యార్థుల లో ఉత్పత్తి పరమైన నూతన ఆవిష్కరణ, సమస్య ను పరిష్కరించడం లతో పాటు గా అంతవరకు అవలంబిస్తున్న ఆలోచన విధానాని కి భిన్నం గా సరికొత్త ఆలోచన లను చేసే సంప్రదాయాన్ని నెలకొల్పాలని ధ్యేయం గా పెట్టుకొంది.

ఎస్ఐహెచ్ లో నమోదు లు చేసుకొంటున్న బృందాల సంఖ్య తొలి సంచిక లో సుమారు 7500 గా ఉన్నది కాస్తా తాజా అయిదో సంచిక కు వచ్చే సరికి నాలుగింతల వృద్ధి తో ఇంచుమించు 29,600 కు చేరుకోవడాన్నిబట్టి ఈ కార్యక్రమాని కి పెరుగుతున్న లోకప్రియత్వాన్ని గమనించవచ్చును. ఈ సంవత్సరం లో 15,000 మంది కి పైగా విద్యార్థులు మరియు మార్గదర్శకులు ఎస్ఐహెచ్ 2022 గ్రాండ్ ఫినాలే లో భాగం పంచుకోవడం కోసం 75 నోడల్ కేంద్రాల కు చేరుకొంటున్నారు. 2900 కు పైగా పాఠశాల లు మరియు 2200 ఉన్నత విద్య సంస్థల కు చెందిన విద్యార్థులు ఫినాలే లో పాల్గొని, 53 వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి అందే 476 సమస్యల కు (వీటి లో ఆలయాల కు చెందిన శిలా శాసనాల కు సంబంధించిన ఆప్టికల్ కేరిక్టర్ రెకగ్ నిశన్ (ఒసిఆర్) దేవనాగరి లిపి లోని అనువాదాలు, త్వరగా పాడయిపోయే ఆహార పదార్థాల కోసం ఉద్దేశించినటువంటి కోల్డ్ సప్లయ్ చైన్ లో ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) ఆధారిత రిస్క్ మానిటరింగ్ సిస్టమ్, విపత్తు విరుచుకుపడ్డ వంటి ప్రాంతాల లో భూమి, మౌలిక సదుపాయాలు మరియు రహదారుల స్థితుల పై అధిక స్పష్టత తో కూడినటువంటి 3డి నమూనా మొదలైనవి సహా ఉంటాయి) పరిష్కారాల ను కనుగొనేందుకు కృషి చేయనున్నారు.

ఈ సంవత్సరం లో, పాఠశాల విద్యార్థుల మనస్తత్వాన్ని అభివృద్ధి పరచడం తో పాటు నూతన ఆవిష్కరణల సంస్కృతి ని తీర్చిదిద్దడం కోసమని పాఠశాల విద్యార్థుల కు ఒక ప్రయోగాత్మక కార్యక్రమమా అన్నట్లు గా 'స్మార్ట్ ఇండియా హాకథన్-జూనియర్' ను కూడా ప్రవేశపెట్టడం జరిగింది.

# ప్రతి జిల్లాలో సెంట్రల్ నర్సరీ.. అన్ని రహదార్లలో అవెన్యూ ప్లాంటేషన్..

హైదరాబాద్, ఆగష్టు 23: ప్రతి జిల్లాకు ఒక సెంట్రల్ నర్సరీని అటవీశాఖ ఏర్పాటు చేయనుంది. ఆ నర్సరీల్లో కనీసం ఐదు లక్షలకు తగ్గకుండా మొక్కలను పెంచుకునేలా చర్యలు తీసుకోనున్నారు. దశలవారీగా సెంట్రల్ నర్సరీల సంఖ్యను పెంచుకోవాలని అటవీశాఖ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం అరణ్యభవన్ నుంచి అన్ని జిల్లాల అటవీశాఖ అధికారులతో అటవీశాఖ పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాల పర్యటన ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో హరితహారం నిర్వహణ, అటవీ పునరుద్ధరణ, అర్బన్ ఫారెస్టు పార్కులు, అటవీ అనుమతుల ప్రక్రియపై అధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణకు హరితహారంలో భాగం రాష్ట్ర వ్యాప్తంగా మరింత చిక్కటి పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రహదారి వనాలు (అవెన్యూ ప్లాంటేషన్) రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రహదారులకు విస్తరించాలని ఆయన ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన చోట్ల ఎక్కడైనా చెట్లు చనిపోతే గ్యాప్ ప్లాంటేషన్ను పొడవైన మొక్కలతో పూర్తి చేయాలన్నారు.

రాజీవ్ రహదారి వెంబడి పచ్చదనం మరింత పెంచేలా ఆయా జిల్లాల పరిధిలోకి వచ్చే అధికారులు శ్రద్ధ పెట్టాలని సూచించారు. అర్బన్ ఫారెస్టు పార్కుల నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రతతో అర్బన్ ఫారెస్టు పార్కులు పర్యావరణహితంగా ఉండాలని ఆయన ఆదేశించారు. అనంతరం అటవీ పునరుద్ధరణ పనులు, పురోగతిపై పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్ సమీక్షించారు. అడవుల ప్రాధాన్యత, పునరుద్ధరణ ద్వారా సాధించిన ప్రగతిని సీఎంతో పాటు ప్రముఖుల పర్యటనల సందర్భంగా ఫోటోలు, వీడియోలతో ప్రదర్శించాలని అన్ని జిల్లాల అటవీ అధికారులకు ఆయన సూచించారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం అటవీ భూముల మళ్లింపు అవసరమైన చోట్ల అనుమతుల ప్రక్రియ వేగంగా జరిగేలా క్షేత్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పీసీసీఎఫ్ (ప్రొడక్షన్ ) ఎం. సీ . పర్గెయిన్ కోరారు. మళ్లింపులో భాగంగా రెవెన్యూ నుంచి తీసుకున్న భూములను నోటిఫై చేయడంతో పాటు ప్రత్యామ్నాయ అటవీకరణ సత్వరం చేపట్టాలని తెలిపారు. ఈ సమీక్షలో అన్ని జిల్లాల అటవీ సర్కిళ్ళ చీఫ్ కన్జర్వేటర్లు, జిల్లాల అటవీ అధికారులు పాల్గొన్నారు.

# దేశంలో కొత్తగా 8వేలకుపైగా కరోనా కేసులు

న్యూఢిల్లీ, ఆగష్టు 23: । దేశంలో కరోనా గడిచిన 24 గంటల్లో కొత్తగా 8,586 రికార్డయ్యాయని కేంద్ర కుటుంబ ఆరోగ్యమంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. తాజాగా 9,650 మంది బాధితులు కోలుకోగా.. మహమ్మారి కారణంగా 48 మృత్యువాతపడ్డారు. కొత్త కేసులతో దేశంలో కరోనా కేసుల సంఖ్య 4,43,57,546కు చేరింది. ఇందులో 4,37,33,624 మంది బాధితులు కోలుకున్నారు. వైరస్ కారణంగా ఇప్పటి వరకు 527,416 ప్రాణాలు కోల్పోయారు. మరో వైపు దేశంలో కొవిడ్ వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతున్నది. ఇప్పటి వరకు 210.31కోట్ల డోసులు పంపిణీ చేసినట్లు ఆరోగ్యశాఖ పేర్కొంది.

# బీర్ బాటిల్తో వ్యక్తిపై దాడి.. గొంతులో పొడవడంతో తీవ్రగాయలు

హైదరాబాద్, ఆగష్టు 23: హైదరాబాద్ కుత్బుల్లాపూర్లో దారుణం జరిగింది. ఓ వ్యక్తిపై బీర్ బాటిల్తో అటాక్ చేసిన ఘటన నెలకొంది. గొంతుపై బీర్ బాటిల్తో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్ షాప్ వద్ద జరిగిన ఘర్షణ ఓ వ్యక్తి ప్రాణం మీదికి తెచ్చింది. మద్యం మత్తులో బీర్ బాటిల్ తో దాడి చేయడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరొకరు గాయపడిన ఘటన హైదరాబాద్ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇవ్వాల జరిగింది.

జీడిమెట్ల పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం? చింతల్ వేంకటేశ్వర నగర్ కు చెందిన విద్యాసాగర్ (27), సందీప్(27) స్నేహితులు. వీరు నిన్న (సోమవారం) అర్ధరాత్రి చింతల్ లో పాషా పాన్ షాప్ వద్ద ఉన్నారు. అదే సమయంలో గౌతం (28), షాబాజ్ (30) అనే ఇద్దరు పాన్ షాప్ సమీపంలో మద్యం తాగుతూ ఉన్నారు. ఈ క్రమంలో విద్యాసాగర్, షాబాజ్ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గొడవ పెద్దది కావడంతో షాబాజ్ తన చేతిలో ఉన్న బీర్ బాటిల్ పగులకొట్టి దానితో విద్యాసాగర్ గొంతుపై పొడిచాడు. పక్కనే ఉన్న సందీప్, గౌతం షాబాజ్ ను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో సందీప్ కు స్వల్పంగా గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ తెలిపారు.

# ఆటో - ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి మృతి.. పలువురికి గాయాలు

మంచిర్యాల, ఆగష్టు 23: చెన్నూరు సమీపంలోని సుద్దాల వద్ద ఆటో, ద్విచక్రవాహనం ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురికి గాయపడ్డారని సీఐ ప్రవీణ్కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లాకు చెందిన బానాల విజయ కుటుంబంతో కలిసి దైవ దర్శనానికి వెళ్లి.. తిరిగి ఇంటికి ఆటోలో బయలుదేరారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో చెన్నూరు శివారులోని సుద్దాల ఎక్స్రోడ్.. ఎన్హెచ్63 హైవే వద్దకు రాగా.. సుద్దాల నుంచి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి ద్విచక్ర వాహనంపై ఆటోను ఢీకొట్టాడు.

దీంతో ఆటో పల్టీ కొట్టింది. ఆటోలో ఉన్న బానాల రాజమణి (18) యువతి తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందింది. ఆటో డ్రైవర్ నరేశ్తో పాటు అతని భార్య శిరీష, కుమారుడు రిషికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం డ్రైవర్ దుర్గం కిరణ్ సైతం తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చెన్నూరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.


# ప్రతి జిల్లాలో సెంట్రల్ నర్సరీ.. అన్ని రహదార్లలో అవెన్యూ ప్లాంటేషన్..

హైదరాబాద్, ఆగష్టు 23: ప్రతి జిల్లాకు ఒక సెంట్రల్ నర్సరీని అటవీశాఖ ఏర్పాటు చేయనుంది. ఆ నర్సరీల్లో కనీసం ఐదు లక్షలకు తగ్గకుండా మొక్కలను పెంచుకునేలా చర్యలు తీసుకోనున్నారు. దశలవారీగా సెంట్రల్ నర్సరీల సంఖ్యను పెంచుకోవాలని అటవీశాఖ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం అరణ్యభవన్ నుంచి అన్ని జిల్లాల అటవీశాఖ అధికారులతో అటవీశాఖ పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాల పర్యటన ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో హరితహారం నిర్వహణ, అటవీ పునరుద్ధరణ, అర్బన్ ఫారెస్టు పార్కులు, అటవీ అనుమతుల ప్రక్రియపై అధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణకు హరితహారంలో భాగం రాష్ట్ర వ్యాప్తంగా మరింత చిక్కటి పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రహదారి వనాలు (అవెన్యూ ప్లాంటేషన్) రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రహదారులకు విస్తరించాలని ఆయన ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన చోట్ల ఎక్కడైనా చెట్లు చనిపోతే గ్యాప్ ప్లాంటేషన్ను పొడవైన మొక్కలతో పూర్తి చేయాలన్నారు. రాజీవ్ రహదారి వెంబడి పచ్చదనం మరింత పెంచేలా ఆయా జిల్లాల పరిధిలోకి వచ్చే అధికారులు శ్రద్ధ పెట్టాలని సూచించారు. అర్బన్ ఫారెస్టు పార్కుల నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రతతో అర్బన్ ఫారెస్టు పార్కులు పర్యావరణహితంగా ఉండాలని ఆయన ఆదేశించారు. అనంతరం అటవీ పునరుద్ధరణ పనులు, పురోగతిపై పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్ సమీక్షించారు. అడవుల ప్రాధాన్యత, పునరుద్ధరణ ద్వారా సాధించిన ప్రగతిని సీఎంతో పాటు ప్రముఖుల పర్యటనల సందర్భంగా ఫోటోలు, వీడియోలతో ప్రదర్శించాలని అన్ని జిల్లాల అటవీ అధికారులకు ఆయన సూచించారు.


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com